# గొప్ప ప్రోత్సాహం

## పేతురు వ్రాసిన మొదటి పత్రిక సంగ్రహ సమీక్ష

### I. ఉపోద్ఘాతం :

బైబిలులోని క్రొత్త నిబంధనలో, యేసుక్రీస్తు 12 మంది శిష్యులలో ముగ్గురు వ్రాసిన 8 గ్రంథాలు ఎంతో ప్రాముఖ్యమైనవి. మత్తయి, యోహాను మరియు పేతురు వ్రాసిన గ్రంథాలన్నీ ప్రత్యేక విశిష్టతను సంతరించుకొన్నాయి.

**1. గ్రంథకర్త :** అపొస్తలుడైన పేతురే ఈ రెండు పత్రికలు వ్రాసాడు. అయితే పేతురు రెండవ పత్రికలో తగినన్ని చారిత్రాత్మక ఆధారాలు లేవని, రెండు పత్రికల శైలిలోను, పదజాలంలోను, వ్యత్యాసం ఉందని, ఆది సంఘము చాల కాలం వరకు దానిని ప్రామాణిక గ్రంథంగా పరిగణించలేదు. క్రీ॥శ॥ 372 సం॥లో లవొదికొయలో క్రైస్తవ సమాఖ్య **(Council)** ద్వారా రెండవ పత్రిక ప్రామాణిక గ్రంథాలలో చేర్చబడింది. పేతురే రెండు పత్రికలు వ్రాసాడని, రెండు పత్రిలలోని పరిచయ వాక్కులను బట్టి (**I** పేతు 1:1; **II** పేతు 1:1) చెప్పవచ్చును. రెండవ పత్రిక యేసు రూపాంతరాన్ని కన్నులారా చూచిన వ్యక్తి వ్రాసాడన్నది స్పష్టం (**II** పేతు 1:16-18). అతడు తన మరణాన్ని గూర్చి ప్రభువు ద్వారా ముందుగానే తెలిసికొన్నవాడు (**II** పేతు 1:13-15) మరియు అతడు మరో పత్రిక కూడా వ్రాసాడు (**II** పేతు 3:1). పత్రికలో ఉన్న ఆధారాలను బట్టి, పేతురే రెండవ పత్రిక వ్రాసాడని చెప్పవచ్చును. మత్త 17:1-3; యోహాను 21:18,19; **I** పేతు 1:1 తో పోల్చి చూడండి.

**2. పేతురు జీవితం :** అపొస్తలుల జాబితాలో సీమోను పేతురు ప్రథముడు. అతడు అందరికన్న వయస్సులో పెద్దవాడు, దుడుకుతనంగలవాడు. యేసు మొదటిసారి అతన్ని కలిసికొన్నప్పుడు అతనికి కేఫా అని పేరు పెట్టాడు. కేఫా అనగా రాయి అని అర్థం (యోహా 1:42). అతడు జాలరి. విద్యావంతుడుకాదు. అయితే క్రీస్తుతో 3 1/2 సం॥ కలిసి జీవించిన ఇతడు పామరుడుకాడని అతని పత్రికలలోని సిద్ధాంతపర అంశాలు నిరూపిస్తున్నాయి. అంత మాత్రమే కాదు పేతురు జీవితంలో కలిగిన గొప్ప మార్పును ఈ పత్రికల ద్వారా తెలిసికోవచ్చును. మొదట అతడు క్రీస్తును కలిసినపుడు బలహీనుడు, తొట్రుపాటు గలవాడు. కాని ఇప్పుడు క్రీస్తులో బలవంతుడు, స్థిరుడు. మొదట తొందరపాటు గలవాడు. ఇప్పుడు సహనశీలి. యేసు అతనితో "నీవు పేతురువు, ఈ బండమీద నా సంఘమును కట్టుదును" (మత్త 16:18) అని చెప్పినా, ఆ బండ క్రీస్తేనని, ఆయనే సంఘానికి ముఖ్యమైన మూలరాయి అని, తాను కేవలం ప్రతి విశ్వాసిలాగే ఒక రాయి మాత్రమేనని (**I** పేతు 2:5) తెలిసికొన్నాడు. అపొస్తలుల జాబితాలో తనపేరు మొదట ప్రస్తావించబడినా, పెంతెకొస్తు దినాన సంఘస్థాపనలో ప్రధాన పాత్రధారుడైనా, తన్నుతాను హెచ్చించుకోలేదు. పైగా తగ్గింపును గూర్చే వ్రాసాడు (**I** పేతు 5:6,7).

**3. రచన కాలం :** పత్రికలలోని అంశాలను బట్టి, పౌలు పత్రికలన్నీ వ్రాయబడిన అనంతరం, అనగా నీరో చక్రవర్తి రోమా సింహాసనాన్ని అధిష్టించాక, శ్రమలు ప్రారంభమైన కాలంలో పేతురు తన పత్రికలు వ్రాసాడు. పేతురు కూడ ఆ శ్రమలలో పాలిభాగస్తుడే (I పేతు 5:1). పేతురు రెండు పత్రికలు క్రీ॥శ॥ 64-66 మధ్య కాలంలో వ్రాయబడ్డాయి. మొదటి పత్రిక వ్రాసిన కొద్ది కాలానికే, మరియు అతని మరణానికి కొంతకాలం క్రితమే రెండవ పత్రికను వ్రాసాడు.

**4. రచన స్థలం :** పేతురు తన మొదటి పత్రికను ఏ స్థలం నుండి వ్రాసాడన్నది వివాదాస్పదమైనది. I పేతురు 5:13 లో **"బబులోనులో మీవలె నేర్పరచబడిన ఆమెయు, నా కుమారుడైన మార్కును, మీకు వందనములు చెప్పుచున్నారు"** అని వ్రాయబడి ఉన్నది. పేతురు రోమా పట్టణంలో చంపబడ్డాడన్న పారంపర్యం ఉంది గనుక అతడు రోమాలో ఉన్నప్పుడు ఈ పత్రికలు వ్రాసాడని బబులోను అన్నది రోమాకు సూచనగా, ఆమె అన్నది సంఘానికి సూచనగా ఉందని కొంత మంది అభిప్రాయం. అయితే ఎందుకు అలంకార రూపంలో వ్రాసాడన్నదానికి సరైన కారణాలు లేవు. పైగా అతడు రోమాలో చంపబడ్డాడనడానికి చరిత్రాత్మక ఆధారాలేమి లేవు.

కనుక వాస్తవంగా అతడు బబులోను నుండే వ్రాసాడని మరి కొందరి అభిప్రాయం. అతడు రోమా పట్టణానికి వెళ్ళినట్లు బైబిలులో వ్రాయబడలేదు. ఒకవేళ పేతురు రోమాలో సేవ చేస్తూ ఉంటే పౌలు అక్కడికి వెళ్ళాలని కోరడు. ఎందుకంటే అతడు క్రీస్తునామమెరుగని చోటనే సువార్త ప్రకటించాలన్న ఆశగలవాడు (రోమా 15:20:21). బహుశా పేతురు పౌలును అనుసరిస్తూ రోమా సామ్రాజ్య కేంద్రభాగమైన చిన్న ఆసియాలో కొంతకాలం ఉన్నాడేమో. అతని పాఠకులు చిన్న ఆసియాలోని పొంతు, గలతీయ, కప్పదొకియ, ఆసియ, బితునియ దేశస్థులు (I పేతు 1:2). అయితే చిన్న ఆసియా నుండి పౌలు తనసేవలో దక్షిణ దిశగా వెళ్ళాడు, పేతురు తూర్పుదిశగా ప్రయాణించి బబులోనుకు వెళ్ళాడని, అక్కడి నుండి ఈ పత్రికను వ్రాసాడని చెప్పవచ్చును. అతడు పేర్కొన్న స్థలాల పేర్లను కూడ తూర్పుదిశనుండి అనగా తాను ఉన్న దిశనుండి మొదలు పెట్టి పశ్చిమ దిశ వరకు క్రమముగా వ్రాసాడు. రెండవ పత్రిక బహుశా రోమా పట్టణం నుండి వ్రాసి ఉండవచ్చును.

**5. పాఠకులు :** పౌలు అన్యులకు, పేతురు యూదులకు సువార్త ప్రకటించడానికి ఏర్పరచబడ్డారు (గల 2:8,9). కనుక పేతురు చిన్న ఆసియాలోను, బబులోనులోను చెదరి ఉన్న యూదుల మధ్య పరిచర్య చేసి ఉండవచ్చును. బబులోను చెర అనంతరం యూదులు అందరూ యెరూషలేముకు తిరిగి రాలేదు. పైగా రోమా సామ్రాజ్యానికి క్లౌదియ చక్రవర్తిగా ఉన్నకాలంలో యూదులకు, క్రైస్తవులకు కలిగిన హింసలలో, అకుల ప్రిస్కిల్లలు కొరింథుకు వచ్చినట్లు, కొంతమంది యూదులు బబులోనుకు పారిపోయారు. అక్కడ, మరియు చిన్న ఆసియాలో యూదుల వలస కేంద్రాలున్నాయి. వారికే పేతురు ఈ పత్రికలను వ్రాసాడు (I పేతు 1:2). ఈ పత్రికలు నేటి క్రైస్తవులందరికి కూడ వర్తిస్తాయి.

**6. పత్రికల ముఖ్యాంశం :** పేతురు మొదటి పత్రిక ముఖ్యాంశం శ్రమలలో విశ్వాసి నిరీక్షణ. ఈ పత్రికలో శ్రమలను గూర్చి 16 సార్లు ప్రస్తావించబడింది. శ్రమలతో పాటు నిరీక్షణ అనే మాట కూడ చెప్పబడింది. యోహాను **"ప్రేమ"** అపొస్తలుడు, పౌలు **"విశ్వాసపు"** అపొస్తలుడు. పేతురు **"నిరీక్షణ"** అపొస్తలుడు. శ్రమలను గూర్చి హెబ్రీ పత్రిక, యాకోబు పత్రికల రచయితలు కూడ వ్రాసినా, పేతురు వివరణ ప్రత్యేకమైనది. అతడు తనస్వంత అనుభవం ద్వారా వ్రాసాడు. ఇక రెండవ పత్రిక ముఖ్యాంశాలు, విశ్వాసం మరియు దేవుని జ్ఞానం, విశ్వాసి దేవుని కృపలో జ్ఞానంలో అంతకంతకు ఎదగాలి (II పేతు 3:18). క్రీస్తునందు విశ్వాసం ఎంత అవసరమో ఆయనను గూర్చిన అనుభవ జ్ఞానం కూడ అంతే ప్రాముఖ్యమైనది (యోహా 17:3). పేతురు రెండవ పత్రికలో జ్ఞానం అన్నమాట 16 సార్లు కనిపిస్తుంది. పేతురు మొదటి పత్రిక శ్రమ బాధితులకు గొప్ప ప్రోత్సాహం రెండవ పత్రిక సంఘం లోపల తలఎత్తే దర్భోధల సమస్యకు పరిష్కారం.

**7. పేతురు పత్రికల విశిష్టత :** పేతురు కాలంలో సంఘంలో, ప్రసంగ వేదిక నుండి వెలువడిన శరీర సంబంధమైన బోధల ద్వారా (I పేతు 2:11). భౌతిక వాదం ప్రవేశపెట్ట బడింది (I పేతు 5:1-3). గనుక పేతురు తన మొదటి పత్రికలో క్రీస్తును గూర్చిన సిద్ధాంతాన్ని అనగా, ఆయన శరీరధారిగా అవతరించుట (1:20) ఆయన పాప రహిత జీవితం (1:19; 2:22) శ్రమలు మరియు మరణం (1:11, 2:23,24; 3:18; 4:1,13; 5:1) పునరుత్థానం (3:21) ఆరోహణం మరియు ప్రస్తుత స్థానం (3:22) గూర్చి మరియు ఆయన రెండవ రాకడను గూర్చి (1:13,17; 4:13; 5:4) స్పష్టంగా వ్రాసాడు. అంతమాత్రమే కాదు క్రీస్తు బిరుదులను కూడ వ్రాసాడు. నిర్దోషమైన గొఱ్ఱెపిల్ల (1:19) ముఖ్యమైన మూలరాయి (2:6) అమూల్యమైన రాయి (2:7) అడ్డుబండ (2:8) ఆత్మల కాపరి (2:25) ప్రధాన కాపరి (5:4).

క్రీస్తు బిరుదులతో పాటు ఈ పత్రికలో విశ్వాసికి అనేక బిరుదులు ఇవ్వబడ్డాయి. విధేయులైన పిల్లలు (1:14) క్రొత్తగా జన్మించిన శిశువులు (2:2) సజీవ రాళ్ళు, పరిశుద్ధ యాజకులు (2:5) ఏర్పరచబడిన వంశము, రాజులైన యాజక సమూహము, పరిశుద్ధ జనము, దేవుని సొత్తు (2:9) యాత్రికులు, పరదేశులు (2:11) క్రైస్తవులు (4:16) నీతిమంతులు (4:18) దేవుని మంద (5:2).

ఇక రెండవ పత్రిక విషయానికొస్తే యూదా పత్రికలోని 25 వచనాలలో దాదాపు 19 వచనాలలోని అంశాలు ఇందులో వ్రాయబడ్డాయి. పేతురు రెండవ పత్రిక, పౌలు తిమోతికి వ్రాసిన రెండవ పత్రికతో పోల్చబడింది.

అ) పౌలు మరియు పేతురు సంఘం దేవుని వాక్యముపై నిలిచి ఉండాలన్న సందేశాన్ని ఇచ్చారు. వాక్యమే సంఘానికి ఏకైక ప్రమాణం.

ఆ) ఈ రెండు పత్రికలలోను క్రైస్తవ విశ్వాసులకు ముఖ్య సూచనలు మరియు విమత సిద్ధాంతాలను గూర్చిన హెచ్చరికలున్నాయి (IIపేతు 2 అధ్యా, II తిమో 3 అధ్యా).

ఇ) II తిమోతిలో వ్రాయబడిన విషయాలు I తిమోతిలోని విషయాలకు భిన్నంగా ఉన్నట్లే II పేతురులోని విషయాలు I పేతురులోని అంశాలకు వేరుగా ఉన్నాయి.

ఈ) దేవుని వాక్యం పరిశుద్ధాత్మ ప్రేరణతో వ్రాయబడిందన్న సత్యాన్ని ఈ రెండు పత్రికలు నొక్కివక్కాణిస్తున్నాయి. (II తిమో 3:16; II పేతు 1:21).

ఉ) ఈ రెండు పత్రికలు కూడ రచయితల అవసాన దశలో వ్రాయబడ్డాయి.

ఊ) తాము క్రీస్తు కొరకు హతసాక్షులుగా చనిపోతారన్న విషయం పౌలుకు, పేతురుకు ముందుగానే తెలుసు (II తిమో 4:6; II పేతు 1:13-5).

పౌలు మరియు పేతురు లక్షణాలు, వారి వ్యక్తిత్వాలు, బోధలు భిన్నమైనవైనా ఇద్దరూ ఒకే ప్రభువును ప్రకటించారు.

## II. పేతురు మొదటి పత్రిక విభజన

| | | |
|---|---|---|
| 1. | విశ్వాసుల శ్రమ మరియు భద్రత (ఇవి సంతోషాన్నిస్తాయి) | 1:1-9 |
| 2. | శ్రమలు మరియు లేఖనాలు (ఇవి పరిశుద్ధతను చేకూరుస్తాయి) | 1:10-25 |
| 3. | విశ్వాసుల శ్రమ మరియు క్రీస్తు శ్రమ | 2-4 అధ్యా |
| | అ. ఇవి ప్రత్యేకించబడడానికి దోహదపడతాయి | (2 అధ్యా) |
| | ఆ. క్రైస్తవ ప్రవర్తనను రూపొందిస్తాయి | (3 అధ్యా) |
| | – కుటుంబంలో ప్రవర్తన | (3:1-7) |
| | – సంఘంలో ప్రవర్తన | (3:8-17) |
| | ఇ. దేవుని చిత్తానికి లోబడేలా చేస్తాయి | (4 అధ్యా) |
| 4. | విశ్వాసుల శ్రమ మరియు క్రీస్తు రెండవ రాకడ | 5 అధ్యా |
| | అ. ఇవి సేవాసక్తిని, నిరీక్షణను కలిగిస్తాయి | (5:1-4) |
| | ఆ. దీన మనస్సును, సహనాన్ని అలవరుస్తాయి | (5:5-14) |

## III. పేతురు మొదటి పత్రిక అధ్యాయాల వారిగా అంశాల సంక్షిప్త వివరణ

**A.** మొదటి అధ్యాయంలో మానవులకు దేవుడు అనుగ్రహించిన రక్షణ, మరియు ఆయన సార్వభౌమత్వాన్ని గూర్చి వ్రాయబడింది.

1. మన రక్షణకు త్రిత్వంలోని ప్రతి వ్యక్తి కూడ ఆధారముగా ఉన్నారు. తండ్రియైన దేవుడు తన భవిష్యద్ జ్ఞానమును బట్టి మనల్ని ఎన్నుకొన్నాడు, ఆత్మ పరిశుద్ధపర్చాడు, కుమారుడు తన రక్తం ద్వారా విమోచించాడు (I పేతు 1:1,2).

2. రక్షణలోని ఆశీర్వాదాలు : జీవముతో కూడిన నిరీక్షణ మరియు స్థిరమైన స్వాస్థ్యం, (1:3,4) ఈ స్వాస్థ్యం అక్షయమైనది, స్వచ్ఛమైనది మరియు శాశ్వతమైనది.

3. రక్షణలోని శ్రమలు (1:5-9)

4. మన రక్షణ మరియు శ్రమలను గూర్చి పాత నిబంధన భక్తుల వివరణ (1:10-12). పాత నిబంధన ప్రవక్తవలె పేతురు కూడ ఈలోక జీవితానంతరం మనం మహిమలో ఆనందించాలంటే ఈ లోకంలో శ్రమలను అనుభవించాలని ప్రోత్సాహించాడు (1:6-9).

5. **మన రక్షణ పట్ల దేవ దూతల ఆసక్తి (1:12) :** దూతలు మనకు ఉన్న రక్షణను అనుభవపూర్వకంగా ఎరుగకున్నా, దానిని చూడాలన్న ఆశ మరియు ఆసక్తి వారికి ఉన్నది. (దానియేలు 12:5,6; I కొరి; ఎఫె 3:10).

6. **మన రక్షణను గూర్చిన ఉన్నతమైన పిలుపు (1:13-17) :** రక్షించబడినవారికి దేవుడు ఇచ్చే ఉన్నతమైన పిలుపు పరిశుద్ధులుగా జీవించుట అన్నదే (1:14-16). ఈ ఉన్నతమైన పిలుపును గూర్చి పౌలు కూడ తన పత్రికలన్నిటిలో జ్ఞాపకం చేసాడు (రోమా 1:2; I కొరింథి. 1:2; I థెస్స 4:3,7). ఈ పరిశుద్ధత మన ఆచరణాత్మక జీవితంలో అలవర్చబడుతుంది. ప్రతి ఒక్కరూ తీర్పులోనికి వస్తారు గనుక భయముతో జీవించాలి (1:3,17).

7. మన రక్షణ యొక్క గొప్ప విలువ (1:18-22) : మనకు ఇవ్వబడిన రక్షణను ఉచితంగా పొందాము గాని దాని కొరకు గొప్ప విలువ చెల్లించబడింది. క్రీస్తు తన నిర్దోషమైన, పాపరహిత రక్తాన్ని విమోచన క్రయధనంగా చెల్లించాడు గనుక మనకు విమోచన లభించింది. ఈ విలువలు గుర్తించినప్పుడే విశ్వాసులు, తమ జీవిత విలువను గుర్తిస్తారు.

8. **రక్షణ పొందే విధానం (1:23,24) :** మానవుల రక్షణ కొరకు దేవుడే స్వయంగా చేయవలసినదంతా చేసాడు. అయితే ఈ సత్యాన్ని గూర్చి వాక్యము ద్వారా తెలిసికొని, వాక్యానికి విధేయత చూపి పాపక్షమాపణ పొందుట ద్వారానే ఒక వ్యక్తి తిరిగి జన్మించగలుగుతాడు. శారీరకంగా, క్షయబీజం నుండి స్వతహాగా పాపిగా పుట్టిన వ్యక్తి, వాక్యమనే అక్షయ బీజం ద్వారా తిరిగి పుడతాడు. శాశ్వతమైన అక్షయమైన జీవితం కొరకు ఈ ఆధ్యాత్మిక పునర్జన్మ అవసరం. రక్షణ యొక్క గొప్ప విలువలనెరిగినపుడే నిత్యత్వపు విలువల నెరిగి జీవిస్తారు. ఈ లోకంలో అన్నీ గతించిపోతాయి. గాని దేవుని వాక్యం నిత్యము నిలుస్తుంది (I పేతు. 1:24; I యోహా. 2:17). అదే విశ్వాసి జీవితానికి శాశ్వత విలువల్ని చేకూరుస్తుంది.

**B. రెండవ అధ్యాయంలో, మరియు మూడవ అధ్యాయంలో విశ్వాసి ఆయా విభాగాలలో నిర్వర్తించాల్సిన బాధ్యతలను గూర్చి వ్రాయబడ్డాయి.**

1. **లేఖనాలను గూర్చిన బాధ్యత (2:1-3) :** రక్షించబడిన వ్యక్తి క్రొత్తగా పుట్టిన శిశువులా ఉంటాడు గనుక అతడు ఎదగడానికి నిర్మలమైన వాక్యమనే పాలు అవసరం. ప్రారంభంలో వాక్యం పాలవలె ఉంటుంది. ఆ తరువాత రొట్టెగా, బలమైన ఆహారంగా మారుతుంది. అయితే తిరిగి జన్మించి, శిశువులా ఉన్న విశ్వాసి వాక్యమనే పాలను జీర్ణించుకోవాలంటే సమస్త కపటమును, దుష్టత్వాన్ని, వేషధారణను, అసూయను,

దూషణ మాటలను మానుకోవాలి. వాటిని విసర్జించాలి. ఇవన్నీ పులిపిండి. (I కొరి 5:7,8). దేవుని వాక్యం కల్తీలేని పాలవంటిది దానిని ప్రతి రోజు తీసికోవాలి.

2. **రక్షకుని గూర్చిన బాధ్యత (2:4) :** విశ్వాసి, తాను ఏ బండపైన నిలువబెట్టబడ్డాడో (కీర్త 40:2) ఆ అమూల్యమైన సజీవమైన రాయియైన ప్రభువును బాగా ఎరిగి ఉండాలి. ఆయన మన రక్షణ నిమిత్తం కొట్టబడిన బండ (నిర్గ 17:6) వెంబడించే ఆత్మ సంబంధమైన బండ (I కొరి 10:4) మనుష్యుల చేత విసర్జించబడినా దేవుని దృష్టికి ఏర్పరచబడిన రాయి (I పేతు 2:4). ఆయన సంఘానికి ముఖ్యమైన మూలరాయి (ఎఫె 2:20; I పేతు 2:6). ఆయనను గూర్చిన ఈ గుర్తింపు, విశ్వాసి క్రీస్తులో తన స్థానాన్ని మరియు ఆయన నడిపింపును ఎరగడానికి దోహదపడుతుంది. ఆయన ముఖ్యమైన మూలరాయి అన్న సత్యం, లేఖనాల ప్రాముఖ్యతను గుర్తించేలా చేస్తుంది. విశ్వాసులకు ఆయన అమూల్యమైన రాయిగా ఉన్నాడు. (I పేతు 2:7). అవిశ్వాసులకు తీర్పుతీర్చేవానిగా నలిచేయు రాయిగా (మత్త 21:44) ఉన్నాడు.

3. **క్రీస్తు పనికి సంబంధించిన బాధ్యతలు (2:9,10) :** ఈ భాగం రక్షించబడినవారి పట్ల దేవుని ఉద్దేశాన్ని తెలియజేస్తుంది. ప్రతి విశ్వాసి యాజకునిగా ఉండాలి. దేవుని ఉద్దేశాన్ని ఈ లోకంలో నెరవేర్చాలి. పాత నిబంధనలోని యాజకత్వంలో, క్రీస్తు సిలువ కార్యం అనంతరం మార్పు కలిగింది. ఆయనే ప్రధాన యాజకుడు, మనమందరం ఆయనకు యాజకులం. ఈ యాజకత్వంలోని బాధ్యతలలో కూడ మార్పు ఉన్నది.

అ. ఇప్పుడు మనం జంతుబలిని అర్పించము గాని ఆత్మ సంబంధమైన మందిరంలో, ఆత్మ సంబంధమైన బలులను అనగా మన స్తుతియాగాన్ని (హెబ్రీ 13:15) ఉపకారము అనే యాగమును (హెబ్రీ 13:16) అర్పిస్తాం. అన్నిటికంటె ముఖ్యంగా మన శరీరాలను ఆయనకు సజీవ యాగంగా సమర్పిస్తాం (రోమా 12:1), మరియు విశ్వాస యాగములో దాని సంబంధమైన సేవలో పాణార్పణంగా పోయబడతాము (ఫిలి 1:17; II తిమో 4:6).

ఆ. పాత నిబంధన యాజకుల వలె దీపస్తంభంలోని ప్రదీపాలను వెలిగించముగాని, మనమే వెలుగుగా ఉంటాము. చీకటిలో నుండి ఆశ్చర్యకరమైన తన వెలుగులోనికి పిలిచిన దేవుని గుణాతిశయములను ప్రచురం చేస్తాం. ప్రియ విశ్వాసి! నీవు దేవునికి ఒక యాజకునివి అన్న సత్యాన్ని గుర్తించావా? నీ బాధ్యతలను నమ్మకంగా నిర్వర్తిస్తున్నావా?

4. **అన్యజనులకు సంబంధించిన విధులు (2:11-12) :** విశ్వాసులు ఈ లోకానికి చెందినవారు కారు. ఈ లోకం నుండి ప్రత్యేకించబడినవారే కాని లోకంలోనే జీవించాలి. లోకానికి వేరుగా జీవించాలి. లోకాన్ని యేసు వైపుకు త్రిప్పాలి. అందుకు అన్యుల మధ్య జాగ్రత్తగా మసలుకోవాలని ఈ భాగంలో పేతురు జ్ఞాపకం చేస్తున్నాడు. ఏ విషయంలో వారు మనల్ని దూషిస్తారో ఆ విషయంలో మంచి ప్రవర్తన గలవారై యుండాలి. విశ్వాసి ఇతరులతో మంచి సంబంధం కలిగి ఉండడమే గొప్ప సాక్ష్యం. మనం చెప్పే మాటలకన్న మన జీవితం వారికి గట్టిగా వినిపిస్తుంది.

5. **వారి పనికి సంబంధించిన విధులు (2:13-18) :** పనివారు తమ నిమిత్తం లేక యజమానుల నిమిత్తం కాదు గాని ప్రభువు నిమిత్తం లోబడాలి. దేవుని దాసులమని లోబడాలి. దేవునికి భయపడాలి. అధికారులను సన్మానించాలి. అయితే చెయ్యకూడనివి, అనగా దేవునితో నీ సంబంధాన్ని పాడుచేసే విషయాలను చెయ్యమని చెప్పనపుడు ఈ ఆజ్ఞ వర్తించదు. ఆత్మీయ విషయాలలో దేవునికే లోబడాలి (అపొ. 4:19; 5:29).

6. **విశ్వాసి శ్రమలను గూర్చిన విధులు (2:19-25; 3:13-19) :** ఈ భాగంలో అన్యాయముగా శ్రమ పొందేవారు పాటించాల్సిన విషయాలు వ్రాయబడ్డాయి. ఎవరైనా తప్పిదానికై దెబ్బలు తింటే అందుకు వారే బాధ్యులు. దాని గూర్చి గర్వించవద్దు. అయితే మేలు చేసినా ఇతరులు కీడు చేస్తే అది సంతోషించ దగిన విషయం (మత్త 5:11,12). అది దేవుని దృష్టిలో సరైనది. ఈ సందర్భంగా, పేతురు యేసు శ్రమలను జ్ఞాపకం చేస్తున్నాడు. మనకు శ్రమ కలిగినపుడు యేసు శ్రమలను గూర్చే ధ్యానించాలిగాని మన శ్రమలను గూర్చి చింతిస్తూ కూర్చోవద్దు (హెబ్రీ 12:3). శ్రమలలో సహనానికి క్రీస్తే మాదిరి (I పేతు 2:22,23).

7. **కుటుంబ సంబంధమైన విధులు (I పేతు 3:1-7) :** ఈ భాగంలో భార్యాభర్తల సంబంధంలో ఉండాల్సిన ప్రాముఖ్యమైన విషయాలు వ్రాయబడ్డాయి. విశ్వాసియైన భార్య సత్ప్రవర్తన, అవిశ్వాసియైన భర్తపై గొప్ప ప్రభావాన్ని చూపిస్తుంది. కావాలని ఒక విశ్వాసి అవిశ్వాసిని పెళ్ళాడడం దేవుని చిత్తం కాదు. వారిని మారుస్తానను కోవడం ఆత్మవంచనే. అవిశ్వాసిని పెళ్ళి చేసుకొన్నప్పుడే వారిని దేవుని వద్దకు తెచ్చే అధికారాన్ని కోల్పోయావన్న మాట. అతడు నీ శిరస్సు అన్ని భావం అతనిలో ఉంటుంది. కనుక నీ మాటలు ఇక పని చేయవు. వ్యక్తిగతంగా నీ ఆత్మీయ శక్తి కూడ తగ్గిపోతుంది. కనుక అతనికి బోధ చెయ్యవద్దు కాని సాత్వికముతో లోబడాలి. ఏడ్చి బతిమిలాడి వత్తిడి చెయ్యవద్దు. నీ వినయ విధేయతలే అతన్ని వశపరచుకొంటాయి. ఇది ఒక విశ్వాసిగా భార్య నైతిక కర్తవ్యపాలన, అయితే చెయ్యకూడని పనులు చెయ్యవద్దు. ఈ విషయాలలో రాజీ పడవద్దు. ఎలా ప్రవర్తించాలో ఆత్మనే బోధిస్తాడు. స్త్రీ అలంకారం అసహజంగా ఉండకూడదు. ఆధ్యాత్మిక సౌందర్యమే భర్తను ఆకర్షించాలి. ఆలాగే భర్త తన భార్యను సన్మానించాలి. భర్త ప్రేమించి లోబడతాడు. భార్య లోబడి ప్రేమిస్తుంది. ఒకే శరీరంలో ఆమె సగం, అతడు సగం, అలా సమాధానంగా ఉంటేనే ప్రార్థన చేసుకోడానికి అనుకూలంగా ఉంటుంది. భర్తకు భార్య పట్ల సదవగాహన ఉండాలి. ఆమె భౌతిక బలహీనతలను తన బలంతో పూరించాలి. ఆమె సామర్థ్యాలకు తన సామర్థ్యాన్ని చేర్చి, వాటిని ద్విగుణీకృతం చేయాలి. అప్పుడే క్రైస్తవ ప్రత్యేకత ఆ కుటుంబంలో కానవస్తుంది.

## వివాహంలో మూడు అంతస్తులున్నాయి

ఎ) **భౌతికం :** అనగా లైంగిక సంబంధం. ఇద్దరూ విశ్వాసులైనపుడు లైంగిక సంబంధంలోనికి ఆధ్యాత్మిక పరిమాణం వచ్చి చేరుతుంది. ఈ సంబంధంలోని ఆధ్యాత్మికతను విశ్వాసులు మాత్రమే గ్రహించగలుగుతారు. ఇట్టి భౌతిక సంబంధాన్ని దేవుడు ఆశీర్వదించాడు.

బి) **మానసికం :** ఒకరి కొరకు సహాయపడుతూ కలసి పని చేస్తే కలిగే మానసిక తృప్తి వర్ణనాతీతం. ఇద్దరి అభిరుచులు ఒక్కటైతేనే ఇద్దరికీ ఆనందం. లేకపోతే ఎవరి ఇష్టం

వారిదే. అది వివాహం కాదు. అందులో వినోదం ఉండదు గాని విషాదమే మిగులుతుంది.

సి) **ఆధ్యాత్మికం :** ఇద్దరూ ఆత్మపూర్ణులైతే ఇక ఆ కుటుంబంలో ఆత్మానందమే. కలిసి ప్రార్థించి, కలిసి వాక్యాన్ని ధ్యానించి కలిసి దేవుణ్ణి సేవించడం గొప్ప ధన్యత. శరీరం, మనస్సు, ఆత్మ అనే మూడు పేటలను పేని, దేవుడు దానిని ఒకటిగా చేసినపుడు ఆ త్రాడు తెగదు (ప్రసంగి 4:12).

8. **స్థానిక సంఘంలో విధులు (3:8-13) :** రక్షించబడిన వారు దేవుని కోసం పరిశుద్ధులుగా జీవించడానికి మాత్రమే పిలువబడలేదు గాని సంఘమనే క్రీస్తు శరీరంలో అవయవాలుగా, ఇతర విశ్వాసులకు ఆశీర్వాదకరంగా ఉండడానికి పిలువబడ్డారని ఈ భాగం స్పష్టం చేస్తుంది. ఇది క్రీస్తులో విశ్వాసులందరి ఐక్యతను మరియు ఒకరిపట్ల మరొకరి బాధ్యతలను జ్ఞాపకం చేస్తుంది. అందులో ఏకమనస్సు అన్నది ప్రాముఖ్యమైనది. ఒకరి సుఖదుఃఖాలలో మరొకరు పాలుపొందుట, ప్రేమ, కరుణ, వినయ మనస్సు కలిగి ఉండుట అవసరం (3:8-9). కీడుకు ప్రతి కీడు, దూషణకు ప్రతి దూషణ చేయక దీవించాలి. జీవమును ప్రేమించి, మంచి దినాలను చూడగోరినవారు నాలుకను, పెదవులను అదుపులో ఉంచుకోవాలి. సమాధానాన్ని వెదకి వెంటాడాలి (3:10-12; కీర్త 34:12-15).

C. **దేవుని దీర్ఘశాంతము (3:19-22) :** ఈ భాగంలోని విషయాలు వివాదాస్పదమైనవైనా అందులో గొప్ప ఆత్మీయ సత్యాలున్నాయి. ఈ భాగంలో వ్రాయబడిన "చెరలోని ఆత్మలు" ఎవరు? అన్న విషయం గూర్చి పలు అభిప్రాయాలున్నాయి.

1. బైబిలులో మనుష్యులను ఆత్మలుగా ఎక్కడా చెప్పబడలేదు గనుక ఈ మాట మానవాతీతమైన వారికే (**Supernatural beings**) ఉపయోగించబడిందని కొందరి అభిప్రాయం. ఈ నేపథ్యంలోనే, వీరు పడిపోయిన దేవదూతలకు (దేవుని కుమారులకు) నరుల కుమార్తెల వలన కలిగిన సంతానమని (ఆది 6:1,2) కొంతమంది చెప్తారు. వీరు నిత్యనాశనం కొరకే భద్రం చేయబడ్డారు (యూదా 1:6) (I పేతు 2:4,10) కనుక వీరికి ప్రకటించబడాల్సిన అవసరత లేదని కొందరి వాదనయైతే, వీరికి నాశనం తప్పదని చెప్పడానికి మరియు తాను మృతులలో నుండి లేచుట ద్వారా వారిపై అధికారాన్ని కలిగి ఉన్నాడని నిరూపించుకోవడానికి యేసు వారి యొద్దకు వెళ్ళాడని వీరు వాదిస్తారు.

2. చెరలోని ఆత్మలు పాత నిబంధన కాలంలో దుష్టుల ఆత్మలని, ఈ ప్రకటన వారికోసమేనని మరి కొందరి అభిప్రాయం. అయితే ఈ అభిప్రాయం, ఒక వ్యక్తి చనిపోయాక కూడ అతని ఆత్మకు సువార్త చెప్పవచ్చన్న మార్మనిజం అనే తప్పు సిద్ధాంతాన్ని బలపరుస్తుంది. గనుక ఈ అభిప్రాయం సరైనది కాదు.

3. వీరు పాతాళంలోని ఆత్మలు కాదని, వాస్తవంగా నోవహు ఓడను సిద్ధపరుస్తున్న దినాలలో నివసించిన ప్రజలని, వాస్తవంగా యేసు నోవహు చేత ఆత్మ ద్వారా వారికి ప్రకటించాడని చెప్పవచ్చును. అలాగే ఈనాడు కూడ తన సేవకుల ద్వారా ప్రకటిస్తూనే ఉన్నాడు. ఈ భాగంలో మరో ముఖ్యమైన విషయాన్ని గమనించాలి. నీటి బాప్తిస్మం రక్షణకు లేక శుద్ధీకరణకు సాధనం కాదు. నోవహు నీటి ద్వారా రక్షణ పొందలేదు. నీటి ద్వారా కలిగే ప్రమాదం నుంచి తప్పించబడి సురక్షితంగా ఉన్నాడని అర్థం. అలాగే విశ్వాసి బాప్తిస్మ సమయంలో నీటిలో మునిగి లేచినపుడు, తాను మరణం నుండి, తీర్పు నుండి తప్పించబడి క్రీస్తులో సురక్షితంగా ఉన్నానని సాక్ష్యమిస్తున్నాడు. ఈ సాదృశ్యాన్ని చెప్తూ పేతురు, బాప్తిస్మం యొక్క అసలైన అర్థాన్ని వివరించాడు (I పేతు 3:21).

## D. నాల్గవ అధ్యాయంలో శ్రమల వలన కలిగే మేలును గూర్చి వ్రాయబడింది.

1. **శ్రమలు విశ్వాసిని శుద్ధి చేస్తాయి (4:1-3) :** విశ్వాసిని పాపానికి దూరంగా ఉంచడానికి దేవుడు శ్రమలను రానిస్తాడు. శరీరంలో బాధలు అనుభవించిన వ్యక్తి పాత స్వభావంపై విజయాన్ని పొందుతాడు. దేవుణ్ణి సంతోష పెట్టాలన్న మనస్సు వస్తుంది.

2. **శ్రమలు ఆధ్యాత్మికంగా వర్ధిల్లజేస్తాయి (4:12-15) :** లోకం వలన హింసలు కలుగుతున్నాయంటే, విశ్వాసి ఆత్మీయంగా వర్ధిల్లుతున్నాడని అర్థం. లోకానుసారమైన క్రైస్తవులకు శ్రమలుండవు. హింసించబడుతున్న వారు తమకేదో వింత సంభవిస్తున్నట్లు ఆశ్చర్యపడవద్దు. క్రీస్తుతో మహిమలో ఆనందించాలంటే ఆయన శ్రమలలో పాలివారైనట్లు సంతోషించాలి. అప్పుడు మహిమాస్వరూపియైన ఆత్మ మీ మీద నిలుస్తాడు. "నిలుచుట" అన్న మాటకు వాడబడిన గ్రీకు పదం యొక్క అక్షరార్థం భూమికి విశ్రాంతి నిచ్చుటకు సంబంధించినది. భూమి నుండి తక్కువ సారాన్నే తీసుకొనే పంటలను తరచుగా పండించి విశ్రాంతినివ్వడం వలన, భూమి మరెక్కువ సారాన్ని కూడగట్టుకొని అధిక దిగుబడినిస్తుంది. అలాగే పరిశుద్ధాత్మ శ్రమలలో విశ్వాసికి నూతన బలాన్ని చేకూర్చి శ్రమలలో క్రీస్తును ప్రీతి పరచేలా జీవించే శక్తినిస్తాడు.

3. **శ్రమలు విశ్వాసిని, లేఖనాల నుండి జవాబు పొందేలా, మరియు ఇతరులకు జవాబిచ్చేలా చేస్తాయి (I పేతు 3:15) :** శ్రమలలో ఉన్నవారే ఇతరుల కంటే ఎక్కువగా బైబిలు చదువుతారు. వాక్యం వారిని ఆదరిస్తుంది. బలపరుస్తుంది. ఇతరులను ఎదుర్కొనే శక్తినిస్తుంది.

4. **శ్రమలు సంఘాన్ని ఐక్యపరుస్తాయి (4:7-11) :** అన్నిటి అంతం సమీపమైంది గనుక స్వస్థ బుద్ధి కలిగి ప్రార్థన చేయుటకు మెలకువగా ఉండాలి. ప్రేమ అనేక పాపాలను కప్పుతుంది. గనుక ఒకరినొకరు ప్రేమించుకోవాలి. సంఘంలోపల ఈలాంటి ప్రేమ ఉంటే, వెలుపలి నుండి వచ్చే శ్రమలలో సహితం ఐక్యత కలిగి ఉంటారు. దేవుని

కృపకు మనం గృహనిర్వాహకులం. గనుక ప్రేమగల వారు తమ సామర్థ్యాన్ని ఇతరుల మేలు నిమిత్తం వినియోగిస్తారు.

5. **శ్రమల ద్వారా క్రీస్తు మహిమ పరచబడతాడు (4:16) :** ఈ వచనంలో విశ్వాసి క్రైస్తవుడు అని పిలువబడుతున్నాడు. ఈ మాట బైబిలులో మరి రెండు సార్లు కూడ వాడబడింది. (అపొ. 11:26; 26:28) ఒక క్రైస్తవుడు తన విశ్వాసాన్ని గూర్చి శ్రమ అనుభవించినపుడు అతడు సిగ్గు పడక ఆ నామమును బట్టే దేవుని మహిమపరచాలి.

## E. ఐదవ అధ్యాయం కాపరుల బాధ్యతను గూర్చి మరియు వారికి ఉండాల్సిన వైఖరిని గూర్చి, మంద వైఖరిని గూర్చి, క్రైస్తవ పరిచర్యలోని ఆనందం మరియు శ్రమల అంతిమ ఫలితాన్ని గూర్చి వివరిస్తుంది.

1. **కాపరి పరిచర్య (5:1-4) :** పేతురు కూడ ఈ పరిచర్యలో పాలిభాగస్తుడు గనుక అనుభవపూర్వకంగా ఈ హెచ్చరికలిస్తున్నాడు. మందను మేపి, కాచే ఈ పనికై నియమించబడినవారు బలవంతంగా, వత్తిడిని బట్టి కాక స్వచ్ఛందంగా ఇష్టపూర్వకంగా చేయాలి. స్వలాభం కోసం, స్వార్థం కోసం చేసేది సేవకాదు. కాపరులు కూడ క్రీస్తు గొఱ్ఱెలే. ఆయన వారి ప్రధాన కాపరి. వారు చేసిన పనికి తగిన ప్రతి ఫలం ఇస్తాడు. కనుక సేవ వల్ల వచ్చే ప్రతి ఫలమునందు కాక సేవలోనే ఆనందించాలి.

2. **పరిశుద్ధుల పరిచర్య (5:5-7) :** విశ్వాసుల బాధ్యతల విషయానికొస్తే పెద్దలకు లోబడాలి ఎదుటివారి యెడల దీనమనస్సు కలిగి ఉండాలి. యేసును వెంబడించాలని కోరిన వారందరూ, ఆయన వద్ద నేర్చుకోవాల్సిన గొప్ప సుగుణం ఇది (మత్త 11:29). దేవుడు అహంకారులను ఎదిరించి దీనులకు కృప అనుగ్రహిస్తాడు. యాకోబు కూడ తన పత్రికలో ఇదే విషయాన్ని ప్రస్తావిస్తూ ఆయన ఎక్కువ కృప నిస్తాడని చెప్పాడు (యాకో 4:6).

3. **సైనికునిగా పరిచర్య (5:8-14) :** క్రైస్తవుడు ప్రతిక్షణం ఒక సైనికునిగా, శత్రువైన సాతాను విషయం అప్రమత్తంగా ఉంటూ తన ఆత్మీయ జీవితాన్ని కాపాడుకోవాలనే విషయాన్ని పేతురు ఈ భాగంలో జ్ఞాపకం చేస్తూ, సాతాను ప్రయోగించే ఒక సాధనాన్ని గూర్చి వివరించాడు. సాధారణంగా శ్రమలు కలిగినప్పుడు ఈ లోకంలో తాను ఒక్కడే శ్రమపడుతున్నాడన్న భావాన్ని విశ్వాసిలో సాతాను కలిగిస్తాడు.

   కనుక విశ్వాసులు శ్రమల విషయం సరైన అవగాహన కలిగి ఉండాలి.

   ఎ) ప్రతి విశ్వాసి ఈ అనుభవం గుండా వెళ్ళాలి (5:9)
   బి) ఈ శ్రమలు స్వల్పకాలం వరకే ఉంటాయి (5:10)
   సి) ఈ శ్రమల వలన విశ్వాసి పరిపూర్ణతనొంది, బలపర్చబడతాడు (5:10).

   ఈ సత్యాలను మనస్సులో ఉంచుకొని అపవాదిని ఎదిరించాలి (యాకో 4:7; **I** యోహా 4:4).

# పేతురు వ్రాసిన రెండవ పత్రిక సంగ్రహ సమీక్ష

## పేతురు వ్రాసిన రెండవ పత్రిక విభజన మరియు సంక్షిప్త వివరణ :

పేతురు వ్రాసిన రెండవ పత్రికలో మూడు అధ్యాయాలే ఉన్నా అందులో ప్రాముఖ్యమైన అంశాలున్నాయి.

### I. క్రైస్తవ కృప (1:1-14) :

1. **దేవుని కృప విస్తరించుట (1:1-4) :** కృప విశ్వాసుల స్వాస్థ్యం. కృపలో దేవుని సృజనాత్మక శక్తి ఉన్నది. అది కనపడకుండా పని చేస్తుంది. ఈ కృప క్రీస్తును గూర్చిన అనుభవజ్ఞానం వలన విస్తరిస్తుంది (1:3). విశ్వాసి క్రీస్తును అనుభవ పూర్వకంగా ఎరిగి ఉండాలి. ఈ జ్ఞానం దేవుని వాక్యాన్ని అనుభవించినపుడే వస్తుంది (1:4). దేవుని వాక్యాన్ని ధ్యానిస్తున్నప్పుడు, పరిశుద్ధాత్మ మనల్ని సర్వసత్యంలోనికి నడిపించి క్రీస్తు సంగతులను మన అనుభవంలోనికి తెస్తాడు. దేవుని ద్వారా తిరిగి జన్మించిన వారిది దేవుని స్వభావమే. అయితే పాత స్వభావం కూడ ఉంటుంది. గనుక ఘర్షణ కలుగుతుంది. అందుకే వాక్యంలో నిలకడగా ఉండాలి. అప్పుడే అందలి వాగ్దానాల మూలంగా లోకమందలి భ్రష్టత్వాన్ని తప్పించుకొని, దేవస్వభావంలో పాలివారము అవుతాము (1:4).

2. **క్రైస్తవునికి ఇవ్వబడిన అదనపు కృపలు (1:5-9) :** దేవుని వాక్యం క్రైస్తవ శీలానికి పునాది. క్రైస్తవ కృపలు ఒకదాని వెంట ఒకటి మన సౌశీల్యానికి చేర్చబడాలి. "ఆ హేతువు చేతనే మీ మట్టుకు మీరు పూర్ణ జాగ్రత్తగలవారై మీ విశ్వాసమునందు సద్గుణమును, సద్గుణమునందు జ్ఞానమును, జ్ఞానమునందు ఆశానిగ్రహమును, ఆశానిగ్రహమునందు సహనమును, సహనమునందు భక్తిని, భక్తియందు సహోదర ప్రేమను, సహోదర ప్రేమయందు దయను అమర్చుకొనుడి" (1:5). కృప పొందని వారిలో చెడ్డ ఫలాలే కనిపిస్తాయి. ఫలభరిత జీవితం ఉంటేనే దూరదృష్టి అలవడుతుంది (1:9).

3. **దేవుని పిలుపును గూర్చిన నిశ్చయత (1:10-12) :** విశ్వాసికి క్రీస్తులో శాశ్వత భద్రత ఉన్నది. అతని రక్షణ శాశ్వతమైనది. అయితే అతనికి దాని గూర్చిన నిశ్చయత ఉంటేనే రక్షణలో ఆనందించగలుగుతాడు. ఆత్మీయంగా ఎదగడానికి కృషి చేస్తాడు. ఏ పరిస్థితిలోనూ తొట్రిల్లడు.

4. **పేతురుకు ఇవ్వబడిన దైవ ప్రత్యక్షత (1:13-18) :** యోహాను 21:18,19 లో ప్రభువు చెప్పిన మాటల ప్రకారం, తన మరణ సమయం సమీపించినదని పేతురు గ్రహించి, విశ్వాసులకు ఈ విషయాలను జ్ఞాపకం చేస్తున్నాడు (1:13,14). తాను చనిపోయాక కూడ లోకంలోని విశ్వాసులందరూ నిత్యం వాటిని జ్ఞాపకం చేసికొనేలా

గ్రంథస్తం చేసి ఉంచాడు (1:15). పేతురు తనకున్న స్వల్ప, సమయాన్ని శాశ్వతంగా నిలిచే పరిచర్య కోసం వెచ్చించాడు. ప్రతి విశ్వాసి తన అనుభవాల్ని మరో తరానికి అందించగలిగితే ఆ పరిచర్య చిరస్థాయిగా నిలుస్తుంది.

1:17-19లో పేతురు యేసు క్రీస్తు రూపాంతరమును గూర్చి వివరిస్తూ తాను చూచిన అనుభవం కన్న, వాక్యము ఎంత శ్రేష్ఠమైనదో వివరిస్తున్నాడు. అనుభవాల కన్న, దర్శనాలకన్న దేవుని వాక్యం స్థిరమైనది. వేకువచుక్క అనగా యేసు ప్రభువు (ప్రక 22:16) వచ్చేంత వరకు వాక్యము చీకటిలో వెలుగిస్తూ మనల్ని పరలోక దిశగా నడిపిస్తుంది. అంతటా వ్యాపిస్తుంది.

## II. దేవుని వాక్యం యొక్క ఆత్మావేశం (1:20-21) :

ఈ భాగం వాక్యం యొక్క ప్రాధాన్యతను మాత్రమే కాక, దానిని వ్యాఖ్యానించాల్సిన విధానాన్ని కూడ సూచిస్తున్నది.

1. **వాక్యం యొక్క ప్రాధాన్యత (1:20) :** వాక్యం మనుష్యుల ఊహను బట్టి పుట్టలేదు. బైబిలులోని ప్రవచనాలు ఊహ కాదు. ప్రవచనమనే మూసలోనే చరిత్ర అంతా పోయబడింది. నెరవర్చబడిన ప్రవచనాలను బట్టే బైబిలు దేవుని వాక్యమని నమ్మగలము.

2. **వాక్యము యొక్క వ్యాఖ్యానం (1:21) :** దేవుని వాక్యం పరిశుద్ధాత్మ ద్వారా వ్రాయబడింది. గనుక వాక్య వివరణలో మానవ ఊహలు పనికి రావు. బైబిలులో ఏదో ఒక వచనాన్ని తీసికొని మిగతా వాటిని వదిలిపెట్టి దాని అర్థాన్ని ఒంటిగా వ్యాఖ్యానించకూడదు. అలా వ్యాఖ్యానించడం వల్లనే ఈనాడు తప్పు సిద్దాంతాలు పుట్టగొడుగుల్లా లేచి సంఘాన్ని కలవర పరుస్తున్నాయి. బైబిలు పరిశుద్ధాత్మ వలన ప్రేరేపించబడి మనుష్యుల ద్వారా వ్రాయబడింది. వారు అపస్మారక స్థితిలో లేక పరవశ స్థితిలో ఉండి వ్రాయలేదు. ఓడ గాలిచేత నడిపించబడినట్లు, బైబిలు గ్రంథకర్తలు ఆత్మావేశం చేత నడిపించబడ్డారు (II తిమో 3:16). దేవుని సేవకుల ద్వారా వాక్యాన్ని ఇచ్చిన పరిశుద్ధాత్ముడే దానిని మనకు బోధించాలని ఆశిస్తున్నాడు గనుక వాక్యాన్ని బోధించేవారు తమ స్వంత జ్ఞానాన్ని ఉపయోగించకూడదు (యోహా 14:26; 16:13,14; I కొరింథీ. 2:5,9-16).

## III దేవుని శత్రువుల నుండి తప్పించుకొనుట (2:1-3:4) :

A. **శత్రువులను గుర్తించుట :** ఈ విభాగంలో పలురకాల శత్రువులను గూర్చి పేతురు వివరించాడు.

1. **పూర్వ కాలంలోని శత్రువులు (2:4) :** ఈ వచనంలో పేతురు, తమ స్వాభావిక దోషానికి మరింత పాపాన్ని (ఆది 6:1-5) జత చేసికొన్న కొంతమంది పడిపోయిన దూతలను గూర్చి వ్రాసాడన్న అభిప్రాయం ఉన్నది. (యెష 14:12-15; యెహె

28:11-19; (ప్రక 12:3,4) వీరికి సాతానుతో పాటు, ఒక దినాన తీర్పు ఉన్నది (యూదా 1:6).

2. **నోవహు కాలం నాటి ప్రజలు (2:5) :** వీరు భక్తిహీనులు. నోవహు కాలంలో మతం ఉన్నది గాని వారి మతంలో సత్యదేవుడు లేడు. శరీరానుసారులై దేవుడు లేనట్లే ప్రవర్తించారు. శరీరానుసారమైన దానిలో మంచిది ఏది ఉండదు (రోమా 7:18). వీరికి జల ప్రళయం ద్వారా తీర్పు విధించబడింది.

3. **లోతుకాలం నాటి ప్రజలు (2:6-10; ఆది. 19 అధ్యా; యూదా 1:7) :** ఆదికాండములో లోతును గూర్చి వ్రాయబడని విషయాలు కొన్ని అనగా అతని రక్షణను గూర్చి (2:7) (నీతిమంతుడు); అతని ఆత్మను గూర్చి (2:8) (నీతిగల మనస్సు); అతని రక్షకుణ్ణి గూర్చి (2:10) (ప్రభువు); ఈ పత్రికలో ఉన్నాయి. లోతుకాలం నాటి ప్రజలు భక్తి హీనులు, పరశరీరానుసారులు కనుక ముందుకు భక్తిహీనులగు వారికి దృష్టాంతముగా ఉంచడానికి (2:6; యూదా 1:7); నీతిమంతుడైన లోతును తప్పించడానికి (1:7,10), వారికి తీర్పు తీర్చబడింది. యేసు భూమ్మీద పరిచర్య కాలంలో నోవహు మరియు లోతును గూర్చి ప్రస్తావించాడు (లూకా 17:26-30). ఆనాటి ప్రజలలాంటివారు ఈనాడు కూడ ఉన్నారు. గనుక జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించబడుతున్నాం.

4. **అబద్ద బోధకులు (2:1-3, 12:21) :** అబద్ధ ప్రవక్తలున్నట్లే అబద్ద బోధకులున్నారు. వీరు వివాదాంశాలను బోధిస్తారు ప్రభువునే విసర్జిస్తారు. వీరు తమ్మును తాము నాశనం చేసుకొంటారు. వీరి దుర్బోధ వల్ల సత్యమార్గం దూషించబడుతుంది. వీరి మాటలు వినడానికి ఇంపుగా ఉంటాయి గాని, వారు ప్రజలకు ఏమి ఇవ్వలేదు. వీరు కూడ తీర్పులోనికి వస్తారు.

B. **శత్రువుల లక్షణాలు :** విశ్వాసి తన శత్రువుల నుండి తప్పించుకోవాలంటే వారి లక్షణాలను తెలుసుకొని ఉండాలి. ఈ లక్షణాలు క్రొత్తవేమి కావు. 2:1-3:5లో వీరి లక్షణాలన్నీ వివరంగా వ్రాయబడ్డాయి. వీరు దేవుని పక్షంగా లేరు గనుక దేవుని విరోధులు (లూకా 11:24-26). క్రీస్తు విరోధులు, విశ్వాసులకూ విరోధులే. విశ్వాసులు గొర్రెలుగా తమ కాపరి స్వరాన్ని వింటే అంత సులభంగా మోసపోరు (యోహా 10:4,5). హితబోధను సహింపని, దురద చెవులుగలవారు వీరి కల్పనా కథలు వైపు ఆకర్షించబడతారు (II తిమో 4:3,4).

IV. **క్రీస్తురాకడ కొరకు కనిపెట్టుట - ఆపేక్షించుట (3:12) :** యేసు రెండవ రాకడ, కాలానికి చివరి బిందువు. మరణం పాపం మరియు నరకం పూర్తిగా ఓడిపోయే రోజు అది. క్రీస్తు తన తండ్రికి రాజ్యాన్ని అప్పగించేరోజు (I కొరింథీ. 15:24-28). ఆ దినం విశ్వాసుల ఆత్మ రక్షణ అంతిమ ఘట్టం.

1. **అపహాసకుల మాటలు (3:3,4) :** అంత్య దినాలలో అపహాసకులు ప్రభువు రాకడను గూర్చి నిరుత్సాహకరమైన, సందేహాస్పదమైన మాటలు చెప్తారు. అన్నీ సృష్టి ప్రారంభం నుండి ఉన్నట్లే ఉన్నాయి కదా? కనుక ప్రభువు మాటలేవి నెరవేరవని చెప్తారు. ఈ లోక సంఘటనలన్నీ దేవుని ప్రణాళికలేనని నిరూపిస్తున్నాడు (3:9). అంత మాత్రమే కాదు దేవుడు తన కాలమానము ప్రకారమే పని చేస్తాడు (3:8).

2. **విశ్వాసుల ప్రవర్తన (3:12) :** విశ్వాసులు యేసు రాకడ కొరకు కనిపెడుతూ, పరిశుద్ధమైన ప్రవర్తనతో, భక్తితో జాగ్రత్తగా ఉండాలి. ఈ లోక విషయం కోసం బ్రదకడంలో అర్థం లేదు. అవన్నీ గతించిపోతాయి (I యోహా 2:15-17). కనుక వాటిని విసర్జించి స్వస్థబుద్ధితో బ్రతకాలి (తీతు 2:11-14). యేసు తనకోసం కనిపెట్టుకొని ఉండే వారి కోసమే వస్తాడు. (హెబ్రీ 9:28). విశ్వాసులుగా ప్రభువు చెప్పింది చేయడం ద్వారానే అనగా క్రీస్తు నెరుగనివారికి సువార్త ప్రకటించుట ద్వారానే ఆ దినాన్ని శీఘ్రతరం చేసిన వారమౌతాము. నీ రాజ్యం వచ్చునుగాక! అంటే అర్థం అదే.

3. **లోకం విషయం దేవుని ప్రణాళిక (35-13) :** ఈ భాగంలో లోకమును గూర్చి దేవుని త్రికాల ప్రణాళిక ఉన్నది. పూర్వకాలం లోకము నాశనం చేయబడుట (3:6). ప్రస్తుత లోకం అగ్ని కొరకు నిలువ చేయబడుట (3:7). భవిష్యత్తులో క్రొత్త లోకం (3:13).

   ఈ లోకమంతా దేవుని వాక్యం వలననే సృష్టించబడింది. దేవుని వాక్యం ద్వారానే భద్రం చేయబడుతుంది. మన శరీరంలోని ప్రతి అణువు ఆయన ద్వారానే చేయబడ్డాయి. అవన్నీ కూడ భద్రం చేయబడ్డాయి. మనల్ని, లోకాన్ని సంరక్షించే ఆయన శక్తి ఒక్క క్షణం ఆపివేసినా ప్రపంచమంతా లయమైపోతుంది. త్వరలో అలా జరుగబోతుంది. అందుకు కారణం మానవుల పాప చర్యలే.

4. **విశ్వాసులకు సూచనలు (3:14-18) :** క్రైస్తవులు ఈ లోకంలో, పరలోకంలో మరియు కాలంలో, నిత్యత్వంలో ఒకేసారి జీవిస్తారు. ఈ రెండింటికి సమన్వయం ఎంతో అవసరం. కనుక వాక్యములో విన్న, చదివిన విషయాలను తరచూ జ్ఞాపకం చేసుకుంటూ ఉండాలి. మనసు అనే పలక మీద మనం వ్రాసుకొన్న వాటిని, కాలం చెరిపివేస్తుంది జాగ్రత్త. వాక్యాన్ని మననం చేసుకోకుంటే మరచిపోతాము. క్రైస్తవులు బాధ్యత గుర్తెరిగి బ్రతకాలి. అజ్ఞానం క్షమించరాని నేరం. క్రీస్తు అనుగ్రహించు కృపయందును జ్ఞానమందును అభివృద్ధి పొందాలి. అట్టి కృప ప్రభువు దయచేయును గాక! (3:18).

# గొప్ప జీవం

## యోహాను వ్రాసిన మొదటి పత్రిక సంగ్రహ సమీక్ష

**I. ఉపోద్ఘాతం :**

బైబిలులోని పుస్తకాలన్నీ వ్రాయబడ్డాక, చివరగా వ్రాయబడిన, యోహాను పత్రికలు, అతడు వ్రాసిన సువార్తతో పాటు గొప్ప ప్రాధాన్యతను సంతరించుకొన్నాయి. యోహాను సువార్తలాగే, అతని పత్రికలు కూడ ఓ ప్రత్యేకమైన ఉద్దేశంతో వ్రాయబడ్డాయి (యోహా 20:31; I యోహా 5:13).

**1. గ్రంథకర్త :** యేసు శిష్యులలో ఒకడైన యోహాను ఈ పత్రికలను వ్రాసాడు.

**2. గ్రంథ రచన కాలం :** యోహాను మొదట సువార్తను, తరువాత ఈ మూడు పత్రికలను, చివరిగా తన మరణానికి ముందు ప్రకటన గ్రంథాన్ని వ్రాసాడని అనేక సంవత్సరాలుగా సంఘం విశ్వసిస్తున్నది. అయితే కొన్ని సంవత్సరాల క్రితం, యోహాను పత్రికలు అన్నిటికన్న చివర వ్రాయబడ్డాయన్న నిర్ణయానికి వచ్చారు. అందుకు కారణం, యోహాను పత్మాసు ద్వీపం నుండి విడుదల పొందాక, ఎఫెసు పట్టణంలో పౌలుచే స్థాపించబడిన సంఘములో కొంతకాలం పరిచర్య చేసి, అక్కడే చనిపోయి పాతిపెట్టబడ్డాడని, క్రీ॥శ॥ 5వ శతాబ్దంలో జస్టినియన్ అనే రోమా అధికారి ద్వారా అతని సమాధిపై "బాసిలికా ఆఫ్ సెంట్ జాన్" నిర్మించబడిందని, చరిత్ర తెలుపుతుంది. దీనిని బట్టి చూస్తే యోహాను తన మూడు పత్రికలను క్రీ॥శ॥ 85-95 మధ్యాకాలంలో వ్రాసి ఉండవచ్చును.

**3. పాఠకులు :** యోహాను తన మొదటి పత్రికను, ప్రకటన గ్రంథాన్ని వ్రాసిన పాఠకులకు, అనగా చిన్న ఆసియాలోని 7 సంఘాలను ఉద్దేశించి వ్రాసాడని కొందరి అభిప్రాయం. మరో విధంగా చెప్పాలంటే దేవుని అనుగ్రహం చేత ఆధ్యాత్మికంగా నూతన జన్మను పొందిన వారందరినీ ఉద్దేశించి వ్రాసాడు. రెండవ మరియు మూడవ పత్రికలు వ్యక్తిగతమైనవి. ఇవి రెండు బైబిలులోకెల్లా చిన్న గ్రంథాలు. రెండవ పత్రిక ఒక స్త్రీకి మరియు మూడవ పత్రిక తన ప్రియ మిత్రుడైన గాయుకు వ్రాయబడ్డాయి.

**4. వ్రాయబడిన సందర్భము :** యోహాను వ్రాసిన పత్రికలను అర్థం చేసుకోవాలంటే, 2వ శతాబ్దపు ప్రారంభంలో ఎఫెసు పట్టణం యొక్క పరిస్థితిని గూర్చి తెలుసుకోవాల్సిన అవసరం ఉన్నది.

అ. ఆ దినాలలో క్రైస్తవ్యం చాల తేలిగ్గా తీసుకోబడింది. అక్కడ ఉన్న విశ్వాసులలో అనేకులు ఆదిమ సంఘంలోని క్రైస్తవుల పిల్లలు మరియు వారి పిల్లల పిల్లలే. అయితే క్రైస్తవ్యంలో ప్రారంభంలో ఉన్న ఉత్సాహం, పటుత్వం తగ్గిపోయింది. వారిలో దేవుని పట్ల ప్రేమ తగ్గిపోయిందని, దేవుడు యోహాను ద్వారా హెచ్చరించాల్సి వచ్చింది (ప్రక 2:4). విశ్వాసులలో ఈలాంటి స్థితి వస్తుందని యేసు ప్రభువు ముందుగానే హెచ్చరించాడు (మత్త 24:12).

ఆ. క్రైస్తవ్యంలోని ఉన్నత ప్రమాణాలు ఆదిమ క్రైస్తవులను, లోకంలో ప్రత్యేకమైనవారిగ చేసాయి. అయితే వారి తదనంతరం వారి పిల్లలు ఈ ప్రత్యేకతను వద్దనుకొన్నారు. రాజీతత్వం ఏర్పడింది. శిష్యత్వపు ప్రామాణికత లోపించింది. బైబిలు ప్రమాణాలు గౌరవించబడలేదు.

ఇ. ఎఫెసులో అబద్ధబోధకుల ప్రభావం ఎక్కువగా ఉండినది. ఈ సంఘానికి వెలుపలి నుండి హింసలు రాలేదు గాని, అంతర్గతంగా ఉన్న ఈ సమస్య వలన క్రైస్తవ్యం మార్చబడే ప్రమాదం ఏర్పడింది. ఈ సమస్యను గూర్చి క్రీస్తు మరియు పౌలు కూడ ఆత్మ ద్వారా ముందుగానే హెచ్చరించారు (మత్త 24:24; అపో.కా. 20:29, 30).

ఈ. ఆ దినాల్లో క్రైస్తవ్యానికున్న బద్ధ శత్రువు జ్ఞానవాదం (గ్నోస్టికత్వం). రోమా సామ్రాజ్యంలో ఇది ప్రధానమైన తత్త్వము. పదార్థము చెడ్డది, ఆత్మ మంచిది గనుక పదార్థ సంబంధమైన ప్రపంచమంతా చెడ్డది అన్న ఉద్దేశంతో వారు శరీరాన్ని త్యజించారు. మట్టిలోని విత్తనంలాగ ఆత్మశరీరంలో ఉన్నది, గనుక దానిని అభివృద్ధిపరచుకోవాలన్న గురితో, విపరీత ధోరణులను అవలంబించేవారు. వీరిలో స్తోయికులు మరియు ఎపిక్యూరియన్లు అనే తెగలు ఒకదానినొకటి భిన్న తత్త్వాలు కలిగి ఉన్నా, యేసు క్రీస్తును మెస్సీయాగా తృణీకరించడంలో మాత్రం ఏకీభావం కలిగి ఉన్నారు. వారికి ఉన్న తప్పుడు అభిప్రాయాలకు లోనుకాకుండ యోహాను పలు విషయాలను స్పష్టం చేసాడు.

1. విశ్వాసుల సహవాసం (1:3)
2. విశ్వాసుల సంతోషం (1:4)
3. విశ్వాసుల శుద్ధీకరణ (2:1)
4. విశ్వాసుల నిశ్చయత (5:13)
5. విశ్వాసుల నమ్మకం (5:14)

## యోహాను మొదటి పత్రిక విభజన :

యోహాను వ్రాసిన మొదటి పత్రికలో దేవుని గూర్చి మూడు నిర్వచనాలున్నాయి. దేవుడు వెలుగైయున్నాడు, ప్రేమయై ఉన్నాడు మరియు జీవమైయున్నాడు. ఈ నిర్వచనాలను బట్టి ఈ పత్రికను విభజించవచ్చును.

## I. దేవుడు వెలుగైయున్నాడు : 1:1-2:2

1. ఉపోద్ఘాతం 1:1,2
2. చిన్న పిల్లలు దేవునితో సహవాసం కలిగి ఉండే విధానం 1:3-2:2
   - ఎ) వెలుగులో నడచుట ద్వారా 1:3-7
   - బి) పాపము ఒప్పుకొనుట ద్వారా 1:8-10
   - సి) క్రీస్తు ఉత్తరవాదత్వం ద్వారా 2:1,2

## II. దేవుడు ప్రేమయైయున్నాడు : 2:3-4:21

1. ప్రియమైన పిల్లలు ఒకరితోనొకరు సహవాసం కలిగి ఉండే విధానం (ప్రేమలో నడచుట ద్వారా) (2:3-14).

2. దేవుని పిల్లలు లోకమును ప్రేమించకూడదు (2:15-28).

3. ప్రియమైన పిల్లలు ఒకరినొకరు ఎలా తెలిసికొని, కలిసి జీవించగలరు (2:29-4:21).

   ఎ) పిల్లల పట్ల తండ్రి ప్రేమ (2:29-3:3)

   బి) విశ్వాసి తన లక్షణాలను ఆచరణలో చూపుట (3:4-24)

   సి) అబద్ధ బోధకులను గూర్చి హెచ్చరిక (4:1-6)

   డి) దేవుడు ప్రేమమైయున్నాడు : దేవుని పిల్లలు కూడ ఒకరినొకరు ప్రేమిస్తారు (4:7-21)

## III. దేవుడు జీవమైయున్నాడు : 5 అధ్యా

1. లోకంపై విజయం (5:1-5)    2. విశ్వాసి రక్షణ నిశ్చయత (5:6-21)

## అంశాల వారిగా యోహాను మొదటి పత్రిక సంగ్రహ సమీక్ష :

యోహాను మూడు పత్రికలు, ఉత్తరాలుగా పిలువబడినా, మొదటి పత్రిక ఉత్తర రూపంలో లేదు. ప్రారంభంలో శుభాశీస్సులు గాని ముగింపులో వందనాలు, ఆశీర్వాదాలుగాని లేవు. ఈ పత్రిక అంతా ఓ ప్రసంగంలా, ఒక ప్రత్యేక సమూహమునకు చెందిన విశ్వాసుల పట్ల, ప్రేమ మరియు శ్రద్ధగల దైవికమైన కాపరి బోధలాగ ఉన్నది. దేవుని పిల్లలను దేవుని ఇంటిలోనికి ప్రవేశింపజేసి కుటుంబ పత్రికగా ఇది పిలువబడింది. పౌలు మరియు ఇతరులు వ్రాసిన పత్రికలు సంఘ పత్రికలు. అవి విశ్వాసులను క్రీస్తు శరీరముగా ఉంటూ, ఆయనలోని ఆశీర్వాదాలను పొందే విధానాన్ని చూపిస్తాయి. యోహాను మొదటి పత్రిక, విశ్వాసము ద్వారా దేవుని కుటుంబంలోనికి చేర్చబడుట, మరియు ఆ కుటుంబంలోని వారు తప్పు చేసినపుడు తండ్రితో సంబంధాన్ని తిరిగి సమకూర్చుకొనే విధానాన్ని నేర్పిస్తుంది.

పౌలు తరువాత క్రొత్త నిబంధనలో ఎక్కువ పుస్తకాలు వ్రాసినవాడు యోహాను. యోహాను సువార్తలో, యేసు సిలువ కార్యం ద్వారా సిద్ధపరచబడిన రక్షణను గూర్చి; మొదటి పత్రికలో ఆయన ప్రస్తుత శుద్ధీకరణ కార్యమును గూర్చి; ప్రకటన గ్రంథంలో భవిష్యత్ మహిమను గూర్చి వ్రాసాడు.

## 1. యోహాను మొదటి పత్రిక విశిష్టత :

ఎ) యోహాను సువార్త క్రీస్తు దైవత్వాన్ని నిరూపించేందుకు వ్రాయబడితే, అతని మొదటి పత్రిక క్రీస్తు మానవత్వాన్ని నిరూపించేందుకు వ్రాయబడింది. యోహాను కాలంలో ఈ రెండింటిని గూర్చిన వివాదాస్పద బోధలున్నాయి.

బి) యోహాను సువార్త, ఒక వ్యక్తి దేవుని బిడ్డగా ఎలాకాగలడో తెలుపుతుంది. యోహాను పత్రిక దేవుని పిల్లలుగా జీవించే విధానాన్ని నేర్పిస్తుంది.

సి) యోహాను సువార్తలో విశ్వాసులను మందలోని గొఱ్ఱెలుగా, యోహాను పత్రికలో దేవుని కుటుంబ సభ్యులుగా, ప్రకటన గ్రంథంలో ఆయన రాజ్యంలో యాజకులుగా వర్ణించాడు.

## 2. పత్రికలోని మూల పదాలు :

ఎ) జీవం (1:1; 2:25; 3:15; 5:11-3,20)

బి) వెలుగు (1:5,7; 2:8-10)

సి) ప్రేమ (3:11-18; 4:7-12)

## 3. ముఖ్యాంశం : సహవాసం

## 4. అంశాలవారిగా వివరణ :

## I. క్రైస్తవ సహవాసం యొక్క మూలము : (1:1,2; 3:5,8,16; 4:9,10,14,19; 5:20)

ఉపోద్ఘాతంలో యోహాను తాను వ్రాసిన విషయాలు, ఇతర రాయబారుల నుండి సేకరించినవి గాని, కల్పించిన కథలుగాని కావని, తాను స్వయంగా విని, చూచి, అనుభవించినవాటినే వ్రాస్తున్నానని స్పష్టం చేసాడు (1:1,2). విశ్వాసులు తండ్రియైన దేవునితోను, కుమారుడైన యేసుక్రీస్తుతోను సహవాసం కలిగి ఉన్నట్లుగా విశ్వాసులందరితో కూడ సహవాసాన్ని కలిగి ఉండాలని వీటిని తెలియజేసాడు (1:3,4) తండ్రి కుమారులు వేరు వేరుగా లేరు. ఒకరితో సహవాసం చేస్తే మరొకరితో చేసినట్లే. ఈ సహవాసం క్రీస్తు శరీరధారిగా అవతరించి, సిలువలో చనిపోవడం వలన ఏర్పడింది (3:5,8,16). తద్వారా ప్రేమ ఎలాంటిదో తెలియజేయబడింది. ఆయనను, ఆయన ప్రేమను ఎరిగి ఉండడమే సహవాసం (యోహా 17:3). క్రీస్తు కేవలం సువార్త ప్రకటించడానికే రాలేదు గాని ప్రకటించడానికి ఒక సువార్త ఉండేలా చేసాడు.

## II. సహవాసం యొక్క ఉద్దేశం :

1. తండ్రిని గూర్చి మరెక్కువగా తెలుసుకోవడానికి, ఆయనతో సహవాసం అవసరం. దేవుని లక్షణాలు ఈ పత్రికలో స్పష్టంగా వర్ణించబడ్డాయి. ఆయన వెలుగు (1:5); నీతి (3:7); సర్వజ్ఞుడు (3:2); ప్రేమ గలవాడు (4:8,16) అదృశ్యుడు (4:12) మరియు జీవము (5:11). ఆయన గుణలక్షణాలను తెలిసికొని అర్థం చేసుకోవాలన్నదే ఈ సహవాసం యొక్క ఉద్దేశం.
2. తండ్రి ప్రేమను అర్థం చేసుకొని (3:16) తండ్రిని ప్రేమించాలని (4:19) మరియు తండ్రి ప్రేమ మనలో పరిపూర్ణం కావాలని (2:5; 4:12).
3. మన సంతోషం పరిపూర్ణం కావాలని (1:4).
4. మనం దేవుని కుటుంబాన్ని ప్రేమించాలని (3:11,23; 4:7,11).
5. విశ్వాసులముగా మన రక్షణను గూర్చిన నిశ్చయత (5:13) మరియు ప్రార్థనలకు జవాబు పొందగలమన్న నిశ్చయత కలిగి ఉండాలని (3:22; 5:14,15) ఈ సహవాసం యొక్క ఉద్దేశం.
6. మనము లోకము చేత మోసగించబడకుండ ఉండడానికి (2:26).
7. శ్రమలు కలిగినపుడు బాధపడకుండ ఉండేందుకు (3:13) ఈ సహవాసం అవసరం.

## III. సహవాసమునకు అవసరమైనవి :

1. వెలుగులో నడవాలి (1:7). వెలుగులో నడవడం అంటే దేవుని వాక్యానికి వ్యతిరేకమైన ప్రతిదానిని నిరాకరించి, ఆయన చెప్పిన దానిని ఆచరణలో పెట్టడమే. వెలుగులో నడుస్తున్న విశ్వాసుల మధ్య మాత్రమే నిజమైన క్రైస్తవ సహవాసం ఉంటుంది.
2. పాపాలను గుర్తించాలి, ఒప్పుకోవాలి (1:8,9). రక్షణ పొందక ముందు చేసిన పాపాలన్నీ రక్షణ పొందినపుడే క్షమించబడతాయి. కాని విశ్వాసులు మాటల్లో, చేతల్లో, తలంపుల్లో కొన్ని సార్లు పాపాలు చేస్తారు (2:1; యాకో 3:2; గల 2:11–13; 5:17; రోమా 7:18; I రాజు 8:16). అయితే వారు వెలుగులో నడుస్తూ ఉంటే ఆ పాపాలను గుర్తించి, ఒప్పుకొంటారు. యేసుక్రీస్తు చేసిన బల్యర్పణను బట్టి దేవుడు క్షమిస్తాడు (2:2). భూమి మీద ఉన్నంతకాలం ఇలా జరుగుతూనే ఉంటుంది.
3. దేవుని ఆజ్ఞలను పాటించాలి. ఒకరినొకరు ప్రేమించాలన్నదే ఆయన ఇచ్చిన క్రొత్త ఆజ్ఞ (2:3–8; 5:2,3). యోహాను 13:34; 15:12 కూడ చదవండి. విశ్వాసులలో దేవుడు ఉన్నాడు గనుక, వారిలో దేవుణ్ణి ప్రేమించే స్వభావం ఉంటుంది. గనుక దేవుని ఆజ్ఞలు వారికి భారమైనవిగా ఉండవు (5:3).
4. క్రీస్తులో నిలిచియుండాలి (2:28) యోహాను 15:1–10 కూడ చదవండి.
5. లోకంలో, అపవిత్రత నుండి (3:3) మరియు విగ్రహారాధన నుండి (5:21) మలినపరచుకోకుండ, నిర్దోషులుగా ఉండాలి.

## IV. సహవాసము యొక్క పరీక్షలు :

మనము దేవునితో సహవాసం చేస్తున్నామని ఎలా తెలుసుకోగలం? మనము ఆయన పిల్లలమని, ఆయనతో సహవాసం కలిగి ఉన్నామని నిర్ధారించుకోడానికి కొన్ని ప్రశ్నలు వేసుకోవాలి.

**1. నేను పాపములో కొనసాగుతున్నానా? (3:6,9; 5:18) :**

పాపంలో ఉన్నవారు, పాపాన్ని తమ జీవితంలో అభ్యాసం చేస్తారు. క్రీస్తులో ఉన్నవారు అలా చెయ్యలేరు (3:6). వారు ఆధ్యాత్మికంగా తిరిగి జన్మించారు. దేవుని సంతానముగా, నీతి స్వభావం వారిలో ఉంటుంది (2:29) వారిలో దేవుని ఆత్మ ఉన్నాడు (4:13) గనుక పాత స్వభావాన్ని కొనసాగించడం కష్టం. కొన్నిసార్లు పాపంలో పడిపోయినా, బుద్ధిపూర్వకంగా దానిలో కొనసాగలేరు. దానిని అసహ్యించుకొని, బయటపడేందుకు ప్రయత్నిస్తారు. పరిశుద్ధాత్మ వారిని ఒప్పిస్తాడు, బయటికి వచ్చేందుకు సహాయం చేస్తాడు. క్రీస్తు వారి పక్షంగా ప్రార్థన చేస్తాడు (లూకా 22:31,32; యోహా 17:17; హెబ్రీ 7:25). ఒకవేళ ఎవరైనా పాపంలో నిలిచి ఉన్నారంటే వారు దేవుని మూలంగా పుట్టలేదని అర్థం. దేవుని బీజం, అనగా ఆధ్యాత్మిక జీవాన్ని ఇచ్చే, దేవుని వాక్యమనే ఆధ్యాత్మిక బీజం, విశ్వాసిలోనే ఉంటుంది. ఇది భ్రష్టస్వభావానికి (I కొరి 9:11) వ్యతిరేకమైనది గనుక, దేవుని ఆత్మ శరీరానికి వ్యతిరేకంగా జరిగించే పోరాటంలో, ఈ బీజం ఆయనతో సహకరిస్తుంది.

**2. నేను క్రీస్తుతో ఎత్తబడాలన్న ఉద్దేశంతో ఈ లోకంలో జీవిస్తున్నానా? (3:3)**

క్రీస్తు వచ్చినప్పుడు ఆయనలాగ ఉండాలని ఆశించినవారు, ప్రస్తుత జీవితంలోను ఆయనలాగే ఉండాలని ఆశిస్తారు. ఆయన పోలికలోనికి మారే క్రియ ఇప్పటికే ఆరంభం అయింది (II కొరి 3:18; కొల 3:9,10). నిజ విశ్వాసులు, ఈవిధంగా మార్చబడే క్రియలో దేవునితో సహకరిస్తారు. తమ్మును పవిత్రం చేసుకొంటారు (I కొరి 7:1; I యోహా 1:7,9).

**3. నేను నిజంగా దేవుణ్ణి ప్రేమిస్తున్నానా? (5:2)**

దేవుణ్ణి ప్రేమిస్తున్నామన్న దానికి నిదర్శనం ఆయన ఆజ్ఞలకు విధేయత చూపించడమే. దేవుని ఆజ్ఞలను పాటించడమే ఆయనను మనం ఎరిగి ఉన్నామన్న దానికి రుజువు (2:3–6). ప్రేమ, విధేయత ఎప్పుడూ కలిసే ఉంటాయి. ఆయనను ఎరిగియున్నవారు ఆయన ఆజ్ఞలను ఎరిగి ఉంటారు, వాటికి విధేయత చూపించి, యేసును అనుసరించే జీవితాన్ని కలిగి ఉంటారు (2:6). అనగా ఆయన ఎలా నడచుకొన్నాడో, విశ్వాసులు కూడ అలాగే నడచుకొంటారు.

**4. నేను నా ఆత్మీయ సోదరుణ్ణి ప్రేమించి, సహాయం చేస్తున్నానా? లేక ద్వేషిస్తున్నానా? (3:15)**

ద్వేషం హత్యలాంటిది, అది ద్వేషించే వ్యక్తినే నాశనం చేస్తుంది సుమా! దేవుడు మన హృదయ స్థితిని కూడ చూస్తాడన్న సత్యాన్ని మరచిపోవద్దు (మత్త 5:21,22). క్రీస్తును విశ్వసించిన వ్యక్తి ద్వేషించడం మానుకొంటాడు. నిజమైన ప్రేమకు మూలాధారం దేవుడే (4:7–10). ఆయన నేర్పించకపోతే ప్రేమ ఏంటో తెలిసేదికాదు. విశ్వాసులు దేవుని మూలంగా పుట్టారు కాబట్టి ప్రేమించడంలో దేవునిలాగే ఉండాలి. ఇది విశ్వసించినవారికి, ఆయన ఇచ్చే ప్రేమ (యోహా 17:26). ఇతరుల ఆధ్యాత్మికమేలును ఆశించి నిస్వార్థంగా సేవచేసే ప్రేమ ఇది. దేవుడు ఏమైయున్నాడో, మనము దేవునిలో ఏమైయున్నామో అన్న దానిని బట్టి ప్రేమించాలి (4:11,16). ప్రేమ కేవలం మనోభావాల మీదనే ఆధారపడితే కుదరదు (3:16). అందులో క్రియలు కూడ ఇమిడి ఉన్నాయి. మంచి పనులు చేయని ప్రేమ ప్రేమయేకాదు (3:17,18; మత్త 25:31–46). దేవుడు, మనం ఇతరులకు చెప్పిన మాటలను బట్టికాక, మన క్రియలను బట్టి తీర్పు తీరుస్తాడు. నిజమైన దైవిక ప్రేమ, దేవుణ్ణి ప్రేమించినట్లే ఇతరులను కూడ ప్రేమించేలా చేస్తుంది (4:19,20; రోమా 5:5). దానిని బట్టి లోకం దేవుని ప్రేమను తెలుసుకుంటుంది.

**5. నేను క్రీస్తు దైవత్వాన్ని నిశ్చయంగా ఒప్పుకొంటున్నానా? (4:15; 5:1) తప్పు సిద్ధాంతాన్ని గుర్తించగలగుతున్నానా? (4:1–3)**

యేసుక్రీస్తు దైవత్వాన్ని నమ్మినవారే దేవుని మూలంగా పుట్టినవారు, యేసు దైవత్వాన్ని మరియు మానవత్వాన్ని అంగీకరించనివారు దురాత్ములు. మనం దేవుని సత్యాలను అనుసరించి నడుస్తున్నామా లేదా అని తెలుసుకునేందుకు ఈ రెండే పరీక్షలు. క్రీస్తు

దైవత్వాన్ని అంగీకరించాలి మరియు దేవుని ఆత్మ ఏదో దురాత్మ ఏదో గ్రహించగలగాలి. విశ్వాసులు దేవుని నుంచి అభిషేకము పొందారు కాబట్టి క్రీస్తు విరోధులను గుర్తుపడతారు. (2:20) బైబిలులో దేవుడు వెల్లడించిన సత్యానికి వ్యతిరేకమైనది ఏదేగాని తప్పు సిద్ధాంతమే (2:21).

**6. నేను దేవుని తీర్పును గూర్చి ఎప్పుడూ భయపడుతూ ఉన్నానా? (4:18)**

విశ్వాసులు దేవుని తీర్పుకు గురికావడానికి గల కారణాలలో సహోదరులను ప్రేమించక పోవడం ఒక కారణం. ఈ ప్రేమను, ఇతరులకు సహాయం చేయడం ద్వారా నిరూపించు కోలేనందు వలన కూడ కొందరికి రక్షణ నిశ్చయత ఉండదు. 3:18లో యోహాను క్రియతోను సత్యముతోను ప్రేమించాలని వ్రాస్తూ, అలా ప్రేమించనివారి హృదయము వారిపై దోషారోపణ చేస్తుందని కూడ వ్రాసాడు (3:19,20) కనుక ఇతరులను ప్రేమించే విషయంలో కూడ మన హృదయము దోషారోపణ చేయని రీతిగా దేవునితో సమాధానం కలిగి ఉండడం అవసరం, ఇతరులను ప్రేమించే వారి హృదయంలో తీర్పును గూర్చిన భయం ఉండదు (**II** కొరి 5:6–9; ఫిలి 1:21; 23; **II** తిమో. 4:7,8). "తీర్పు దినమందు మనకు ధైర్యము కలుగునట్లు దీనివలన ప్రేమ మనలో పరిపూర్ణము చేయబడియున్నది" (4:17,18). తీర్పు దినం గూర్చిన తలంపులు మనలో భయాన్ని కలిగించాయంటే, మనలో ప్రేమ లేదన్న మాట.

**7. నేను లోకాన్ని జయించగలుగుతున్నానా? (5:4)**

యోహాను వ్రాసిన మొదటి పత్రికలో లోకము అన్న మాట 20 సార్లు కనిపిస్తుంది. లోకము దేవుణ్ణి ఎరుగదు (యోహా 14:17; 15:21) విశ్వాసులెవరో ఎరుగదు (**I** యోహా 3:1). లోకము క్రీస్తును, ఆయనయందు విశ్వాసముంచిన వారిని ద్వేషిస్తుంది (యోహా 15:18,24; **I** యోహా 3:13) ఈ లోకము సాతాను వశంలో ఉన్నది. (**I** యోహా 5:19) విశ్వాసులు, అనగా దేవుని మూలంగా పుట్టిన వారందరూ, విశ్వాసము ద్వారా ఈ లోకాన్ని జయిస్తారు. (5:4,5). మానవులు తపస్సు, యోగం ద్వారా లోకానికి దూరంగా ఉండి, సర్వసంగ పరిత్యాగం ద్వారా లోకాన్ని జయించడానికి ప్రయత్నం చేయవచ్చును. కాని అది లోకం నుండి పారిపోవడమే తప్ప జయం కాదు. వీరు లోకాన్ని తమ హృదయంలోనికే తీసుకొనివెళ్తారు. అయితే క్రీస్తును నమ్మిన వ్యక్తి మాత్రమే, లోకంలో ఉంటూనే దాన్ని జయించగలుగుతాడు.

## V. సహవాసాన్ని కాపాడుకొనుట :

దేవునితో మన సహవాసం ఎప్పుడూ ఉంటుందని చెప్పలేము. ఎప్పుడు, ఏమి జరుగుతుందో తెలియదు గనుక ఈ సహవాసాన్ని జాగ్రత్తగా కాపాడుకోవాలి. విశ్వాసులు ఎల్లప్పుడు క్రీస్తును గూర్చిన తలంపులతో సహవాసాన్ని కాపాడుకోవచ్చును. ఆయన మన కొరకు ఏమి చేసాడో, మనకు ఏమైయున్నాడో, మరియు ప్రస్తుతం ఎక్కడ ఉన్నాడో, ఏమి చేస్తున్నాడో తెలిసికొని ఉండాలి. ఆ తలంపులతోనే జీవించాలి.

యేసుక్రీస్తు శాశ్వతమైన బలినర్పించినందు వలన, విశ్వాసులు ఒకవేళ పాపం చేసినా, ఆ బలిని బట్టే తిరిగి సహవాసంలోనికి చేర్చబడే అవకాశాన్ని కల్పించాడు. మన ఉత్తరవాదిగా, తండ్రి కుడి పార్శ్వమున ఉన్నాడు (2:1). పశ్చాత్తాపపడిన విశ్వాసులకు తండ్రితో తిరిగి సహవాసాన్ని సమకూరుస్తున్నాడు. ఈయన మన పాపాలకు మాత్రమే కాదు సర్వలోకమునకు శాంతికరమైయున్నాడు (2:2). లోకంలో ఉన్న వారు ఆయన విమోచనను స్వీకరించనందువల్ల నశిస్తున్నారు. విశ్వాసిలో భ్రష్టస్వభావం, రక్షణ పొందాక కూడ ఉండే ఆస్కారం ఉన్నది. అయితే దాన్ని ఆధారంగా చేసికొని పాపం చెయ్యవద్దు గాని దేవుని సహవాసంలో కొనసాగాలన్న గురితోనే జీవించాలి. దేవుని ఆత్మ అభిషేకం మనలో నిలిచి ఉన్నందువలన (3:27,28) మరియు పాపమును గుర్తించి, ఒప్పుకోవడం ద్వారా, పరలోక సహవాసాన్ని కాపాడుకొంటాము (1:8,9).

## VI. సహవాసంలోని సభ్యులు (2:13, 14) :

విశ్వాసులందరు దేవుని కుటుంబముగా పిలువబడుతున్నారు. ఆత్మీయ పరిపక్వత స్థాయిలను బట్టి దేవుని కుటుంబాన్ని మూడు వర్గాలుగా విభజించవచ్చును.

1. చిన్నపిల్లలు (2:13) యోహా 21:5, I కొరి 3:1; హెబ్రీ 5:13 కూడ చదవండి.
2. యౌవనస్థులు (2:13,14)
3. తండ్రులు (2:14) హెబ్రీ 4:14; I కొరి 4:15,16

## VII. సహవాసం యొక్క శత్రువులు :

యేసుతో తమ సహవాసానికి మరియు నడకకు ఆటంకం కలుగకుండ, విశ్వాసి మూడింటి విషయం అప్రమత్తంగా ఉండాలి.

1. లోకమర్యాదలు లేక పద్ధతులు 2:15-17 :

లోకమును గూర్చి యోహాను ఇక్కడ ప్రస్తావించినది, లోకములోని చెడును గూర్చి అని తలంచవచ్చును. ఈ లోకము శరీరాశ, నేత్రాశ మరియు జీవపుడంబము అనే మూడు విధానాలలో విశ్వాసులలో ప్రవేశిస్తుంది (ఆది 3:6; మత్త 4:3,8). తండ్రి ప్రేమలోని ఆనందాన్ని పొందకుండ చేస్తుంది, ఆయన చిత్తాన్ని నెరవేర్చాలన్న ఆశను సన్నగిల్లచేస్తుంది, వాక్యం మరియు ప్రార్థన పట్ల ఆసక్తి తగ్గిపోయేలా చేస్తుంది. దేవుని సహవాసం పట్ల నిరుత్సాం కలిగిస్తుంది. ఈ లోకము సాతానుకు సంబంధించినది (5:19) అందులోనివన్నీ గతించిపోయేవి (2:17) గనుక విశ్వాసి లోకములో ఉన్నవాటికి లొంగిపోవద్దు.

2. విశ్వాసమును చెరిపే వారిని గూర్చి (2:18,19; 3:7) మరియు
3. ఈలోక సంబంధమైన ఆత్మల విషయం (4:4,6) జాగ్రత్తగా ఉండాలి.

## VIII. సహవాసంలోని వాగ్దానాలు :

1. క్రీస్తుతో నిత్యజీవం పొందుతాము (2:25).
2. క్రీస్తుతో ఎత్తబడతామన్న నిశ్చయతను, ధైర్యాన్ని కలిగి ఉంటాము (2:28).
3. పునరుత్థానంలో క్రీస్తును పోలి ఉంటాము (3:2).
4. క్రీస్తు న్యాయ పీఠం ఎదుట ధైర్యంగా నిలబడతాము (4:17).
5. ఈ లోకంలో సేవ చేసేందుకు ధైర్యాన్ని పొందుతాము (4:18).

## IX. సహవాసమును గూర్చిన సాక్ష్యము (5:6-8) :

ప్రాచీన గ్రీకు ప్రతులలో 5వ అధ్యాయం 7వ వచనం వ్రాయబడలేదు. ఒక విశ్వాసి దేవుని సహవాసంలో ఉన్నాడు అనడానికి యేసుక్రీస్తు, తండ్రియైన దేవుడు మరియు పరిశుద్ధాత్మ సాక్ష్యమిస్తున్నారు. మనుష్యులను గూర్చి సాక్ష్యమివ్వడానికి కనీసం ఇద్దరు మనుష్యుల సాక్ష్యం అవసరం (ద్వితీ 19:15; మత్త 18:16; యోహా 8:17). ఆలాగే దేవుడు మనకు ముగ్గురు సాక్షులను ఇచ్చాడు. ఈ భాగంలో నీళ్ళు మరియు రక్తమును గూర్చి నాలుగు అభిప్రాయాలున్నాయి.

1. నీళ్ళు క్రీస్తు బాప్తిస్మమునకు, మరియు రక్తం ఆయన మరణానికి సూచనగా ఉన్నాయన్న అభిప్రాయం.
2. ఆయన ప్రక్కలో నుండి కారిన నీళ్లు రక్తము అన్న అభిప్రాయం.
3. రక్తం విమోచనకు, నీళ్ళు శుద్ధీకరణకు సూచనలు అన్న అభిప్రాయం.
4. నీళ్ళు బాప్తిస్మము, మరియు రక్తము ప్రభురాత్రి భోజనం అనే సంస్కారములకు గుర్తు అన్న అభిప్రాయము. ఎక్కువ మంది మొదటి అభిప్రాయాన్నే సమర్థిస్తారు (మత్త 3:13-17; హెబ్రీ 9:12).

## X. సహవాసము నుండి వేరుపరచబడుట (5:16,17) :

క్రీస్తుతో మనకున్న ఐక్యత చాల బలమైనది. దానిని ఏదేగాని తెంచలేదని, బైబిలు చెప్తుంది. అయితే ఆయనతో మన సహవాసం చాల సున్నితమైనది. ఏ చిన్న పాపమైనా దానిని తెంచివేస్తుంది. ఈ భాగములో విశ్వాసి పాపంలో పడిపోయే అవకాశం ఉందని, అతని విషయం తోటి విశ్వాసి ప్రార్థించాలని వ్రాయబడింది. అప్పుడు అతని భౌతిక జీవితాన్ని కాపాడినవారౌతారు. విశ్వాసికి ఇవ్వబడిన నిత్య జీవం శాశ్వతమైనది, కోల్పోయేదికాదు. అయితే శరీర మరణానికి హేతువు కాని పాపం చేసినపుడు మాత్రమే వారి నిమిత్తం చేసిన ప్రార్థన భౌతిక ఫలితాన్ని ఇస్తుంది. కాని విశ్వాసి, శరీర మరణాన్ని దారితీసే పాపాన్ని బుద్ధిపూర్వకంగా చేస్తే, దేవుని మార్పు చెందని చట్టాన్ని బట్టి వారు భౌతికంగా దేవుని శిక్షను తప్పకుండ భరించాల్సి ఉంటుంది. కనుక వారి నిమిత్తం ప్రార్థన చేసినా, ఆ శిక్ష రద్దు చేయబడదు. కనుక వారి కొరకు వేడుకోవాలని చెప్పడం లేదు (I కొరింథీ 11:30). పాపము యొక్క తీవ్రత వివిధ స్థాయిలలో ఉంటుంది. అవినీతి అంతా పాపమే. అయితే మరణ శిక్ష విధించబడనంత తక్కువ శిక్ష కలిగిన పాపాలు కూడ ఉంటాయి (I కొరింథి 11:30, బలహీనత, రోగాలు).

# గొప్ప సత్యం

## యోహాను వ్రాసిన రెండవ పత్రిక సంగ్రహ సమీక్ష

### యోహాను వ్రాసిన రెండవ పత్రిక విభజన :

యోహాను రెండవ పత్రికలో సత్యమునుసరించి జీవించుటను గూర్చి వ్రాయబడింది. అయినా ప్రేమను గూర్చి కూడ వ్రాయబడింది. ప్రేమలో నడుచుకోవాలన్నదే దేవుని ఆజ్ఞ. దేవుని కుటుంబంలో ఉండాల్సిన ప్రేమ ఇది. కనుక ఈ అంశాన్ని ఆధారం చేసికొని ఈ పత్రికను విభజించవచ్చును.

I. **సత్యము యొక్క పరిధిలో ప్రేమను వ్యక్తం చేయుట** **1-6వ**
(సత్యముతో ప్రేమించుట)

II. **జీవితము అన్నది క్రీస్తుతత్వాన్ని వ్యక్తపరచేది** **7-11వ**
(తప్పు సిద్ధాంతం చెడు చేయడానికి ఆధారమౌతుంది)

III. **వ్యక్తిగత శుభములు** **12, 13వ**
(క్రైస్తవులు అబద్ధ బోధకులను చేర్చుకోవద్దు, కాని సత్య బోధకులను సంతోషంగా చేర్చుకోవాలి)
బైబిలులో ఒక స్త్రీకి వ్రాయబడిన పుస్తకం ఇదొక్కటే. ఇది వ్యక్తిగతమైన లేఖ. యోహాను తన పేరును గాని, ఆ స్త్రీ పేరును గాని ప్రస్తావించలేదు. బహుశా ఆ దినాలలో రోమీయుల వల్ల కలిగే హింసలను తప్పించుకోడానికి అలా వ్రాసి ఉండవచ్చును.

I. **ఈ స్త్రీ అపొస్తలుని చేత అభినందించబడింది (1-4) :** కొంత మంది, స్థానిక సంఘము స్త్రీకి పోల్చబడిందని, సంఘస్తులు ఆమె పిల్లలుగా పోల్చబడ్డారని భావిస్తారు. కాని యోహాను వాస్తవికంగా ఒక వ్యక్తికే వ్రాసాడు. ఆమె మంచి విశ్వాసి అని, ఆమెకు విశ్వాసులైన పిల్లలు కలరని, అంతమాత్రమే కాకుండ ఆమె సహోదరి కూడ విశ్వాసి అని తెలుస్తున్నది (13వ) ఈ స్త్రీ పిల్లలలో కొందరు సత్యమును అనుసరించి నడుస్తున్నారని యోహాను విని సంతోషిస్తున్నాడు.

II. **ఈ స్త్రీ అపొస్తలుని చేత ఆదేశించబడింది (5,6వ) :** ఈ ఆదేశంలో రెండు విషయాలున్నాయి. ప్రేమలోను సత్యములోను నడవాలి. ఈ రెండూ విడదీయరానివి (ఎఫె 4:15).

III. **ఈ స్త్రీ అపొస్తలుని చేత హెచ్చరించబడింది (7-11) :**

1. అబద్ధ, బోధకుల విషయం జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించబడింది (7,9). వారు యేసును

గురించి సత్యాన్ని బోధించరు. దానికి వేరుగా బోధిస్తారు. కనుక అలాంటి వారిని చేర్చుకోకూడదు. వారితో పొంతన పెట్టుకోకూడదని హెచ్చరించాడు (10వ; రోమా 16:17; **II** కొరి 6:15). వారిని చేర్చుకోవడం వలన వ్యక్తిగతంగా ఆత్మీయంగా నష్టపోవడమే గాక, వారు మంచి బోధకులు అన్న అభిప్రాయాన్ని ఇతరులలో కలిగించే ప్రమాదం కూడ ఉన్నది. మనం వారిని చేర్చుకొంటె, మనల్ని చూసి ఇతరులు చేర్చుకొంటారు. లేదా వారు దుష్టులని పసిగట్టిన వారు, వారిని చేర్చుకొన్న మనల్ని కూడ ఆలాంటి బోధలు చేసేవారిగా పరిగణిస్తారు. అంత మాత్రమే కాదు వారిని చేర్చుకోవడం ద్వారా వారి క్రియలను ప్రోత్సహించినవారమౌతాము. వారి దుష్టక్రియల ప్రతిఫలంలో పాలివారమౌతాము. కనుక అసత్య బోధకుల విషయం జాగ్రత్తగా ఉండాలి.

2. తనను గూర్చి జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించబడింది (8వ). కపట బోధకుల ప్రభావం విశ్వాసులపై దుష్పరిణామమును చూపిస్తుంది. వారు తమ రక్షణను కోల్పోకపోయినా మిగతావన్నీ పోగొట్టుకొనే ప్రమాదం ఉన్నది. (**I** కొరి 3:12–15; 9:27; **II** తిమో 2:5; ప్రక 3:11). కనుక వాటిని పోగొట్టుకొనకుండ పూర్ణఫలము పొందునట్లు జాగ్రత్తగా చూచుకోవాలని వ్రాసాడు. క్రీస్తు కొరకు నమ్మకంగా జీవించి, ఆయనను నమ్మకంగా సేవించిన వారికి సంపూర్ణ ఫలం లభిస్తుంది (రూతు 2:12; **II** కొరి 9:10; ప్రక 22:12).

# గొప్ప మార్గం

## యోహాను వ్రాసిన మూడవ పత్రిక సంగ్రహ సమీక్ష

### యోహాను వ్రాసిన మూడవ పత్రిక విభజన :

యోహాను వ్రాసిన ఈ మూడవ పత్రిక, రెండవ పత్రికలాగే సత్యము అనే అంశంతోనే వ్రాయబడినా ముగ్గురు వ్యక్తుల యొక్క జీవితంలో సత్యము మరియు ప్రేమ ఎలా వ్యక్తం చేయబడిందో వివరించబడింది.

**I. ఆది సంఘంలో ప్రియమైన సహోదరుడు గాయు — 1–8వ**
(ఈ పత్రిక అతనికే వ్రాయబడింది. దేవుని వాక్యాన్ని బోధించే సత్య బోధకులకు ఆతిథ్యమివ్వాలని కోరబడ్డాడు).

**II. ప్రధానత్వము కోరుకున్న దియోత్రెఫే — 9–11వ**
(చెడు క్రియలు తప్పు సిద్ధాంతం యొక్క నిజరూపము)

**III. అందరివలనను, సత్యము వలనను మంచి సాక్ష్యము పొందిన దేమేత్రి 12-14వ**
(మంచి జీవితం సత్య సిద్ధాంతం యొక్క నిజరూపము)

ఇది కూడ రెండవ పత్రికలాగే వ్యక్తిగతమైనది మరియు చిన్నది. స్థానిక సంఘంలో ఉండాల్సిన ప్రవర్తనను గూర్చి ఇది తెలుపుతున్నది.

యోహాను తన రెండవ పత్రికలో విశ్వాసి స్థిరంగా నిలిచేందుకు తగిన సత్యాన్ని గూర్చి వ్రాసాడు. మూడవ పత్రికలో క్రియలు చేయడానికి తగిన సత్యమును గూర్చి వ్రాసాడు. రెండవ పత్రికలో మోసగాండ్రను చేర్చుకోవడం తప్పు అని వ్రాయబడింది. మూడవ పత్రికలో విశ్వాసులను చేర్చుకోకపోవడం తప్పు అని వ్రాయబడింది. మొదటి శతాబ్దపు చివరి కాలంలో ఉన్న సంఘము యొక్క ప్రతిబింబమే యోహాను మూడవ పత్రిక. యోహానుకు అతి ప్రియమైన స్నేహితుడైన గాయుకు ఈ పత్రికను వ్రాసాడు.

ఈ పత్రికలో గాయు, దియొత్రెఫే మరియు దేమేత్రి అనే ముగ్గురు వ్యక్తులను గూర్చి వ్రాస్తూ, క్రైస్తవ సంఘములో ఉండవలసిన లక్షణాలను క్లుప్తంగా వర్ణించాడు.

## I. గాయు అభివృద్ధి (8వ) :

ఈ పేరుగలవారు క్రొత్త నిబంధనలో ముగ్గురు వ్యక్తులున్నారు. ఒకరు కొరింథి పట్టణానికి (రోమా 16:23), రెండవ వ్యక్తి మాసిదోనియా పట్టణానికి (అపో. 19:29) మూడవ వ్యక్తి దేర్బే పట్టణానికి (అపో.కా. 20:4,5) చెందినవారు. ఈ ముగ్గురిలో ఎవరికి ఈ పత్రిక వ్రాయబడిందో చెప్పలేము గాని, యోహాను ఇతన్ని చాల ప్రేమించాడు. అతని కొరకు ప్రార్థించాడు. గాయు ఆత్మీయంగా వర్థిల్లుతున్న వ్యక్తి, అతడు ఎంతగా ఆత్మీయంగా వర్థిల్లుతున్నాడో, అంతగా అన్ని విషయాలలోను వర్థిల్లుతూ సౌఖ్యంగా ఉండాలని యోహాను ప్రార్థించాడు (2వ). వాస్తవంగా చెప్పాలంటే ఆత్మీయంగా వర్థిల్లే ప్రతి వ్యక్తిని దేవుడు అన్ని రంగాలలో వర్థిల్లజేస్తాడు. ఆత్మీయ విషయాలకు ప్రాధాన్యతనిచ్చే వారికి దేవుడు మిగతావన్నీ అనుగ్రహిస్తాడు (మత్త 6:33; I రాజు 3:9-13). యోహాను గాయు నిమిత్తం ప్రార్థించడమే గాక అతనిలోని మంచి లక్షణాలను బట్టి అభినందిస్తున్నాడు. వ్యక్తిగతంగా గాయు సత్యవంతుడు. ఇతరుల మధ్య కూడ అతని సత్య ప్రవర్తన మంచి సాక్ష్యాన్ని పొందినది (3వ) అతడు పరదేశులకు, దేవుని సేవకులకు ఆతిథ్యమిచ్చిన విధానం గొప్పది. సత్యముతో పాటు ప్రేమగల వ్యక్తి (5వ, 6). ఈ సందర్భాన్ని అవకాశంగా తీసికొని యోహాను క్రైస్తవ సంఘంలోను, విశ్వాసుల గృహాలలోను ఉండాల్సిన ఆతిథ్యమును గూర్చి జ్ఞాపకం చేస్తున్నాడు (7, 8). ఇక్కడ కొన్ని ముఖ్యమైన సత్యాలను గమనించాలి.

దేవుని సేవకులు సువార్త ప్రకటిస్తూ ఆయా ప్రాంతాలలో తిరుగుతూ ఉన్నప్పుడు వారు అన్యజనుల వద్ద ఏమి తీసికొనలేదని, కేవలం విశ్వాసులపైననే వారు

ఆధారపడ్డారని గమనించాలి. వీరు దేవుని నామమును బట్టి వచ్చారు గనుక వారిని చేర్చుకొన్న విశ్వాసులు దేవునికి తగినట్టుగా వారికి ఉపకారం చేయాలి. దీనిని బట్టి మనం దేవుణ్ణి ఎంతగా ప్రేమిస్తున్నామో అర్థమౌతుంది. ఈ విధంగా ఉపకారం చేసిన వారు సత్యమునకు సహాయకులుగా, జతపనివారుగా ఉంటారు. ఎంత గొప్ప ధన్యత ! అతిథ్యమెరుగని కుటుంబం క్రీస్తునెరుగని కుటుంబం. క్రీస్తు ఈ గృహంలో అదృశ్య అతిథి అని బోర్డు పెట్టుకున్నంత మాత్రాన చాలదు. క్రీస్తు నామమున వచ్చినవారికి, క్రీస్తుకు ఆతిథ్యమిచ్చినట్లు ఇవ్వాలి.

## II. దియొత్రెఫే గర్వం (9-11వ) :

ఇతడు గాయుకు పూర్తిగా వ్యతిరేకమైన లక్షణాలు గలవాడు. ఆదిమ సంఘంలోని మిషనరీలు విశ్వాసుల గృహాలలో బసచేయడాన్ని దియోత్రెఫే అడ్డగించాడు. అంతమాత్రమే కాదు వారిని చేర్చుకొన్న విశ్వాసులను కూడ ఆటంకపరచి, వారిని సంఘంలో నుండి వెలివేసాడు. ఇతడు చివరికి యోహానును కూడ అంగీకరించక పోగా, అపొస్తలులను గూర్చి చెడ్డగా ప్రచారం కూడ చేస్తూ వచ్చాడు. అందుకు కారణం స్పష్టంగా కనిపిస్తున్నది. ఇతడు సంఘంలో ప్రధాన స్థానాన్ని, ప్రజల మెప్పును కోరిన స్వార్థపరుడు. సంఘమంతా తన చెప్పుచేతల్లో ఉండాలన్న అహంకార మనస్సుగలవాడు. అంత మాత్రమే కాదు, తాను సత్యాన్ని ప్రేమను అనుసరించి నడుచుకోకున్నా, తన క్రియలను బట్టి విశ్వాసి కాదు అని నిరూపించుకున్నా, తానే ప్రజలకు బోధించాలన్న దురుద్దేశం గలవాడు. అందుకే దైవ సేవకులు రాకుండ ఆటంకపర్చాడు.

ఈలాంటి వారు ప్రతి సంఘంలో, సంస్థలో కనీసం ఒకరైనా ఉంటారు. వీరు సంఘాన్ని బోధకులను తమ అదుపులో ఉంచుకొని పెత్తనం చెలాయించాలని కోరతారు. ఈలాంటి వారు దేవుని సంబంధులు కారు. వారు దేవుణ్ణి ఎరుగనివారు (11వ).

## III. దేమేత్రిని అభినందించుట (12వ) :

దేమేత్రి కూడ గాయులాగే సత్యము వలన, అందరివలన, మరి ముఖ్యంగా అపొస్తలుల వలన మంచి సాక్ష్యము పొందినవాడు. మనం చెప్పే మాటలకంటె మన సాక్ష్యం ప్రాముఖ్యమైనది. ఇతరులు మన మాటలకంటె జీవితాన్ని ఎక్కువగా పరిశీలిస్తారు. కనుక క్రైస్తవ సాక్ష్యాన్ని కాపాడుకొంటు క్రీస్తుకు తగినట్లు జీవించాలి. ఆయన నామాన్ని మహిమపర్చాలి. మన జీవితాలు అనేకులకు పురికొల్పుగా ఉండాలి. అప్పుడే లోకం దేవుని ప్రేమను తెలుసుకుంటారు. సువార్తకు ప్రతిస్పందిస్తారు. అట్టి కృప ప్రభువు విశ్వాసులందరికీ దయచేయునుగాక!

# గొప్ప చర్య

## యూదా పత్రిక సంగ్రహ సమీక్ష

I. **ఉపోద్ఘాతం :** క్రొత్త నిబంధనలో ఒకే అధ్యాయం గల నాలుగు చిన్న పుస్తకాలలో యూదా పత్రిక ఒకటి. పలు పత్రికలలో, అంత్యదినాలలో క్రైస్తవ సంఘంలో కలుగబోయే భ్రష్టత్వమును గూర్చి హెచ్చరించబడినా, కేవలం గొప్ప భ్రష్టత్వాన్ని గూర్చి మాత్రమే వ్రాయబడిన పత్రిక ఇదొక్కటే.

1. **గ్రంథకర్త :** ఈ పత్రిక ప్రారంభంలోనే రచయిత పేరు వ్రాయబడింది. క్రొత్త నిబంధనలో యూదా అనే పేరు గల వ్యక్తులు పలువురు ఉన్నప్పటికిని ఇతడు తాను యాకోబు సహోదరుడని పరిచయం చేసుకున్నాడు. ఈ యాకోబు మరియు యూదా ఇద్దరు కూడా యేసు క్రీస్తు సహోదరులు (మార్కు 6:3). యూదా వివాహితుడు, తన భార్యతో పాటు సేవ చేసాడు (I కొరి 9:5). ఈ పత్రికలోని అంశాన్ని బట్టి ఇతడు “క్రొత్త నిబంధన న్యాయాధిపతి” అని పిలువబడ్డాడు.

2. **గ్రంథ రచన కాలం :** ఈ పత్రిక, మొదటి శతాబ్దం చివరి అర్ధభాగంలో, అనగా బహుశా, క్రీ.శ. 66-69 సంవత్సరాల మధ్య కాలంలో వ్రాయబడి ఉండచ్చును. ఖచ్చితమైన కాలాన్ని చెప్పలేము.

3. **పత్రిక వ్రాయబడిన సందర్భం :** వాస్తవంగా యూదా మరో అంశాన్ని గూర్చి వ్రాయాలని ఈ పత్రికను ప్రారంభించాడు (3వ) కాని, సంఘంలో పొడసూపిన భ్రష్టత్వాన్ని ఖండించాల్సిన అవసరతను బట్టి మరియు దాని నుండి విశ్వాసులు తప్పించబడాలన్న ఉద్దేశంతో ఈ పత్రికను వ్రాసాడు. అంత్య దినాలలో కలుగబోయే భ్రష్టత్వాన్ని గూర్చి పౌలు పత్రికలలో చెప్పబడినట్లే, యూదా కాలంలో జరిగింది. అయితే క్రీస్తు రాకడకు ముందు దాని తీవ్రత ఎలా ఉంటుందో, ఆత్మద్వారా పసిగట్టిన యూదా, ప్రేరేపించబడి తాను వ్రాయాలనుకొన్న అంశంలో నుండి విరమించి, ఈ అంశానికి ప్రాధాన్యతనిచ్చాడు.

4. **యూదా పత్రిక విశిష్టత :** కేవలం 25 వచనాలు మాత్రమే ఉన్న ఈ చిన్న పత్రిక క్రొత్త నిబంధనలో గొప్ప విశిష్టతను సంతరించుకున్నది.

అ. భ్రష్టత్వాన్ని గూర్చి బైబిలు అంతటిలో చెప్పబడిన బోధలను యూదా శిఖరాగ్ర స్థాయికి తీసుకొని వచ్చాడు. దానిని వివరించడానికి పాఠకులను మానవ చరిత్ర అంతటిలోనికి తీసుకొని వెళ్ళాడు.

ఆ. పౌలు మరియు పేతురు, వారి పత్రికలలో భవిష్యత్తులో రాబోతున్న భ్రష్టత్వాన్ని గూర్చి వ్రాసారు. యూదా పత్రికలో అప్పటికే సంఘంలో భ్రష్టత్వం చోటు చేసుకున్నట్లు వ్రాసాడు (4వ).

ఇ. క్రొత్త నిబంధన సంఘకాలము అపొస్తలుల కార్యముల గ్రంథములో ప్రారంభమైనది. ఆ కాలము యొక్క అంతము, యూదా పత్రికలో వివరించబడింది. ఈ పత్రికలో భ్రష్టుల కార్యాలు ఉన్నాయి.

ఈ. యూదా పత్రిక ప్రకటన గ్రంథానికి ప్రవేశ ద్వారములాంటిది. అంత్యకాలమును గూర్చి, యేసు బోధనలతో ప్రారంభమై, పత్రికలలో కొనసాగించబడి, ప్రకటన గ్రంథంలో ముగించబడిన ప్రవచనాలు, యూదా పత్రిక లేకుంటే, అసంపూర్ణంగానే ఉండి పోయేవేమో!

ఉ. ఈ పత్రికలో మోషే మరియు హనోకును గూర్చిన విషయాలను రెండు అప్రమాణిక గ్రంథాలలో నుండి ప్రస్తావించడం మరో విశేషం.

## B. యూదా పత్రిక విభజన :

### I. పత్రిక వ్రాయబడిన సందర్భం (1-3వ)

అ. విశ్వాసుల నిశ్చయత (1,2వ) ఆ. భ్రష్టత్వాన్ని గూర్చి చెప్పుట (3వ)

### II. భ్రష్టత్వము పొడసూపుట :

అ. భ్రష్టత్వపు ఆరంభం (4వ)
ఆ. అవిశ్వాసమును బట్టి అరణ్యంలో నాశనమైన ఇశ్రాయేలీయులు (5వ)
ఇ. తిరుగుబాటును బట్టి బంధించబడిన దేవదూతలు (6వ)
ఈ. కామాతురతకులోనైన సొదొమ గొమొఱ్ఱాల నాశనం (7వ)
ఉ. ఆధునిక భ్రష్ట బోధకులను గుర్తించుట (8–10వ)
ఊ. భ్రష్టత్వానికి ఉదాహరణగా నిలిచిన కయీను, బిలాము మరియు కోరహు (11వ)
ఎ. ఆధునిక భ్రష్ట బోధకులను గూర్చి నిర్వచించబడుట మరియు వర్ణించబడుట (12–16వ)

### III. భ్రష్టకాలములో విశ్వాసుల చేయవలసినవి (17-25)

అ. భ్రష్టులు వస్తారని విశ్వాసులు, అపొస్తలులచే ముందుగానే హెచ్చరించబడుట (17–19)
ఆ. ఈ భ్రష్టకాలంలో విశ్వాసులు ఏమి చెయ్యాలి ? (20–25)

1. తమ్మును తాము కట్టుకోవాలి 2. ప్రార్థించాలి
3. తమ్మును తాము కాపాడుకోవాలి 4. కనిపెట్టాలి 5. కనికరం చూపించాలి
6. ఇతరులను రక్షించాలి

## C. అంశాల వారిగా సంక్షిప్త వివరణ :

I. **భ్రష్టత్వం అనే సమస్య (1:1-4)** : ఈ భాగంలో గ్రంథకర్త మరియు పాఠకులను గూర్చి, పత్రిక వ్రాయబడిన ఉద్దేశమును గూర్చి వ్రాయబడింది. ఈ పత్రిక ఒక ప్రత్యేక స్థలంలోని విశ్వాసులకు మాత్రమే వ్రాయబడలేదు గాని, దేవునియందు ప్రేమింపబడి, యేసు క్రీస్తునందు భద్రము చేయబడి, పిలువబడిన వారందరిని ఉద్దేశించి వ్రాయబడింది. కనుక నేటి విశ్వాసులకు కూడ వర్తిస్తుంది. గ్రంథకర్త, తాను యేసుక్రీస్తు సహోదరుడనని గొప్పగా చెప్పుకోలేదు గాని ఆయన దాసుడని చెప్పుకొన్నాడు. రక్త సంబంధం, ఆత్మీయ సంబంధాన్ని అధిగమించకూడదని అతని ఉద్దేశం కావచ్చును.

వాస్తవంగా అతడు విశ్వాసులందరికీ కలిగే రక్షణను గూర్చి వ్రాయాలనుకొన్నాడు గాని పరిశుద్ధాత్మ, వారికి ఒక్కసారే అప్పగించబడిన బోధ నిమిత్తం ఎలా పోరాడాలో,

అబద్ధ బోధకులను ఎలా గుర్తించి, ఎదిరించాలో, మరియు భ్రష్టత్వాన్ని ఎలా తప్పించుకోవాలో వ్రాయమని ప్రేరేపించాడు. ఈ చిన్న ఉపోద్ఘాతంలో యూదా అవశ్యకత, ఆజ్ఞ మరియు శ్రద్ధ కనిపిస్తాయి.

అ. **భ్రష్టత్వం యొక్క వర్ణన :** సుమారు 16 పదాలు మరియు లక్షణాలతో, యూదా భ్రష్టత్వాన్ని వర్ణించాడు. భ్రష్టత్వం అంటే ఏంటీ? భ్రష్టత్వం అంటే, విశ్వాసం నుండి మరియు ఆపొస్తలుల సిద్ధాంతం నుండి తొలగిపోవుట, దేవుడు, తన కుమారుడైన యేసు క్రీస్తు ద్వారా మరియు అపోస్తలుల ద్వారా వెల్లడించిన సత్యం సంపూర్ణమైనది (ఎఫె. 2:20). దానికి ఏమి కలుపకూడదు (ద్వితీ 4:2; సామె 30:6; ప్రక. 22:18,19)

ఆ. **భ్రష్టుల లక్షణాలు :** భ్రష్టుణ్ణి ఈ విధంగా వర్ణించవచ్చును. భ్రష్టుడు వెలుగును పొందాడు గాని "జీవము"ను పొందలేదు. లిఖిత పూర్వక వాక్యాన్ని కొంత వరకు అంగీకరించి ఉండవచ్చును. గాని జీవవాక్యమైన యేసు క్రీస్తును అంగీకరించి ఉండకపోవచ్చును (ఉదా: అపొ. 8:13-23; II థెస్స 2:9,10).

వీరి మొదటి లేక ముఖ్య లక్షణం సంఘములో రహస్యముగా జొరబడుట. (4వ) బాహ్యంగా అపొస్తలులలాగే కనిసిస్తారు కాని వారు అబద్ధబోధకులు (II కొరి 11:13-15). వీరు భక్తిహీనులు (4వ). అనగా వారి జీవితంలో దేవునికి స్థానం లేదు. అయన పట్ల గౌరవం లేదు. పైకి భక్తిగా కనిపిస్తూ దేవుని ఆశ్రయించనివారు (II తిమో 3:5). వీరు దేవుని కృపను కామాతురత్వమునకు దుర్వినియోగం చేస్తారు (4వ). ఆ దినాలలో ఉండిన జ్ఞానవాదం, శరీరం చెడ్డది, ఆత్మమంచిది కనుక శరీరంతో ఎలా జీవించినా ఫరవాలేదని చెప్పేవారు వీరికి నైతిక కట్టుబాట్లు లేవు. వివాహం యొక్క అవశ్యకతను వారు గుర్తించలేదు. రక్షణ కేవలం కృప మూలంగానే కలుగుతుంది గనుక, ఎలా జీవించినా, కృప వారిని క్షమిస్తుందన్నదే వారి సిద్ధాంతం. కృపను దుర్వినియోగ పరచడం అంటే అదే. నైతిక కట్టుబాట్లు కుటుంబాలను, దేశాన్ని నిర్మిస్తాయి. దానిని వీరు అగౌరవపరుస్తున్నారు.

వీరు ప్రభువైన క్రీస్తును విసర్జిస్తారు (4వ), అనగా క్రీస్తు వ్యక్తిత్వాన్ని గూర్చి, అయన పనిని గూర్చి విరుద్ధమైన, కఠినమైన మాటలను చెప్తారు (15వ). అపవిత్రమైన కలలు కంటూ శరీరాన్ని అపవిత్ర పరచుకొంటారు (8వ). దైవిక, మరియు మానవ ప్రభుత్వాలను నిరాకరిస్తారు (8వ). దేవ దూతల ఉనికిని దూషిస్తారు (8వ). వారికి తెలియని విషయాలను గూర్చి దూషిస్తారు (10వ). వారు స్వాభావికంగా ఎరిగిన వాటి వలన తమ్మును తాము నాశనం చేసికొని, వివేకములేని మృగాలవలె ప్రవర్తిస్తారు (10వ). తమ దురాశల చొప్పుననడుస్తారు (16వ). లాభము నిమిత్తం మనుష్యులను పొగడుతారు (16వ). నిజాయితీగా సూటిగా ఉండరు. సణుగుతారు, తమ గతిని గూర్చి నిందిస్తారు (16వ) వీరికి ఎప్పుడూ తృప్తి ఉండదు. తమకు సంభవించేవాటన్నిటికీ దేవుణ్ణి నిందిస్తారు. డంబముగా మాట్లాడతారు (16వ) ఇతరులకు ఇంపుగా అనిపించే, అంశం లేని మాటలు చెప్తారు. వీటన్నిటి వెనుక, తమకు లాభం కలగాలన్న ఉద్దేశమే ఉంటుంది. వారు ప్రకృతి సంబంధులు (19వ). ఆత్మలేనివారు (19వ). భేదాలు కలుగజేసేవారు (19వ). ఈ లక్షణాలన్నిటిలోను వారి హృదయ వైఖరి మూడు విధాలుగా కనిపిస్తుంది.

1. సత్యము పట్ల మరియు దాన్ని అనుసరించే వారిపట్ల ద్వేషం.
2. తమ కోరికల కొరకైన అత్యాశ.
3. దేవునికి విరోధంగా తిరుగుబాటు చేసే స్వభావం.

ఈ లక్షణాలేవైనా తమలో పొడసూపుతున్నాయేమోనని ప్రతి విశ్వాసి పరీక్షించుకోవడం ఎంతైన అవసరం.

## II. భ్రష్టత్వాన్ని గూర్చి చారిత్రాత్మక ఉదాహరణలు :

చరిత్ర ప్రారంభం నుండి భ్రష్టత్వం లోకంలో, మరి ముఖ్యంగా దేవుని ప్రజలలో ఎలా ప్రభలుతున్నాయో ఆరు ఉదాహరణలను చూపించి, యూదా వివరించాడు. అందులో మూడు ఉదాహరణలు సామూహికమైనవి. మూడు వ్యక్తిగతమైనవి.

అ. **అవిశ్వాసము చేత అరణ్యములో నాశనమైన ఇశ్రాయేలీయులు (5వ) :** బహుశా, ఇది కాదేషు బర్నెయా వద్ద జరిగిన సంఘటనకు సంబంధించినదై యుండవచ్చును (సంఖ్యా 14:3). మిశ్రిత జనంచేత ప్రభావితం చేయబడి. విశ్వాసము నుండి తొలగిపోయినవారు అరణ్యంలో నాశనమయ్యారు. వారి నాశనం కేవలం భౌతిక మరణానికి సంబంధించినంత వరకేనని గమనించాలి. వారి పాపమును బట్టి ఆ తరమువారిలో ఇద్దరు తప్ప, ఎవరు కూడా వాగ్దాన భూమిలో ప్రవేశింపలేదు (సంఖ్యా 14:30-33). వీరు నేటి విశ్వాసులకు ప్రతినిధులుగా లేక దృష్టాంతాలుగా ఉన్నారు (I కొరి 10:1-12; హెబ్రీ 3:12,18,19; 4:1) విశ్వాసులు సహితం భ్రష్టులు కాకున్నా, ఈలాంటి భ్రష్టత్వంలో పడిపోయి, బాధపడే అవకాశం ఉంది గనుక జాగ్రత్తగా ఉండాలి.

ఆ. **దేవదూతలు (6వ) :** తమ పాపాన్ని బట్టి పడిపోయిన దేవదూతలు తమ ప్రధానత్వాన్ని కోల్పోయారు. వీరి నిమిత్తం తీర్పు సిద్ధపరచబడి ఉన్నది. ఈ తీర్పును గూర్చి యూదా పత్రిక చెప్పినంత స్పష్టంగా మరే పత్రికలో చెప్పబడలేదు. పడిపోయిన దూతలలో రెండు వర్గాలున్నాయి. తమ స్వేచ్ఛను దుర్వినియోగం చేసిన వారిని దేవుడు శాశ్వతంగా బంధించి ఉంచాడు (యూదా 6వ; II పేతు 2:4). ఈ వర్గం వారు అశక్తులుగా చేయబడ్డారు గనుక ఏమి చెయ్యలేదు. రెండవ వర్గం వారికి, సాతాను నాయకత్వంలో పని చేయగల స్వేచ్ఛ ఉన్నది. వీరు అవిశ్వాసుల శరీరాల్లోకి ప్రవేశించే అవకాశం ఉన్నది (మార్కు 1:23; లూకా 8:27). వీరందరికి ఒక దినాన తీర్పు మరియు నిత్య శిక్ష ఉన్నాయి. ఈ రెండు కూడ ధవళసింహాసన తీర్పుకు ముందే జరుగుతాయన్నది స్పష్టం. I కొరి 6:3; 15:24, 25ను బట్టి ఈ తీర్పు వెయ్యేండ్ల పాలనలో జరుగవచ్చును (ప్రక 20:4). ఆ తరువాత నిత్యశిక్ష విధించబడుతుంది (ప్రక 20:10; మత్త 24:41).

ఇ. **సొదొమ గొమొఱ్ఱాల పాపము (7వ) :** వీరి పాపము పడిపోయిన దూతల పాపముతో పోల్చబడినది. వీరు స్వలింగ సంపర్కము వలన తమ్మును తాము అపవిత్రతకు అప్పగించుకున్నారు (ఆది 13:13; 19:4,5; II పేతు 2:7,8). ఇది దేవుని దృష్టిలో ఘోరమైన పాపం గనుక, ముందు తరాలకు దృష్టాంతంగా ఉండేలా వారిని శిక్షించాడు. ఈ పట్టణాలు అగ్ని గంధకాలతో సమూల నాశనం చేయబడ్డాయి (ఆది 19:24; II పేతు 2:6; యూదా 7వ).

**ఈ. కయీను (11వ) :** భ్రష్టులను గూర్చి వివరిస్తూ యూదా ముగ్గురు వ్యక్తులను దృష్టాంతంగా తీసుకున్నాడు. అంత్యదినాలలో భ్రష్టత్వానికి లోనైన వారి ప్రవర్తన కయీను ప్రవర్తన వలె ఉంటుంది. కయీను నడిచిన మార్గము అనగా, దేవుని వద్దకు వస్తారుగాని విశ్వాసముతో రారు. కనుక వారు నీతిమంతులుగా తీర్చబడరు (హెబ్రీ 11:4). వీరు క్రీస్తు సిలువ రక్తము కంటె మతపరమైన సంస్కృతికి ప్రాధాన్యతనిస్తారు. కయీను మత సంబంధియే కాని ప్రకృతి సంబంధి. దేవుణ్ణి నమ్మక మతాన్ని నమ్మాడు గనుక తన ఇష్టానుసారంగా రక్తం చిందించబడని అర్పణను తెచ్చాడు. పైగా తన క్రియలు చెడ్డవి మరియు తన సహోదరుని క్రియలు నీతిగలవైయున్నందున అతణ్ణి చంపిచేసాడు (I యోహా 3:11,12). కనుక కయీను మార్గము దుష్టుని మార్గము.

**ఉ. బిలాము (11వ) :** బిలాము దుర్నీతి వలన కలుగు బహుమానాన్ని ఆశించి తప్పు త్రోవలో వెళ్ళాడు (I పేతు 2:15). ఇతడు చేసిన తప్పు ఏమంటే సువార్త సేవను లేక దేవుని పనిని వ్యాపారంగా మార్చాడు. దేవుడిచ్చే బహుమానం కన్న తాను సంపాదించే బహుమానంతో గొప్పవాడు కావాలనుకొన్నాడు. అందుకు అతని బోధను కూడ పెడత్రోవ పట్టించాడు. ఇశ్రాయేలీయులు వ్యభిచారానికి పాల్పడి, విగ్రహాలకు బలి ఇచ్చినవాటిని తిని, దేవుని శిక్షకు పాత్రులై చంపబడేలా, మోయాబు స్త్రీలను పురికొల్పమని బోధ చేసాడు (సంఖ్యా 22-25 ప్రక 2:14). ధనాపేక్ష, పేరు ప్రఖ్యాతుల కోసం ప్రాకులాడుట, పదవీ వ్యామోహం ఇవన్నీ బిలాము మార్గానికి చెందినవే.

**ఊ. కోరహు (11వ) :** కోరహు దేవునిచే నియమించబడిన మోషేపై తిరుగుబాటు చేసాడు (సంఖ్యా 16 అధ్యా). సంఘకాపరులకు, దేవుని చేత ఏర్పరచబడిన దేవుని సేవకుల నెవరినేగాని తిరస్కరించి, ఇతరులతో వారిని గూర్చి వ్యతిరేకంగాను, చెడుగాను మాట్లాడేవారందరూ కోరహు కోవకు చెందినవారే.

కయీను విశ్వాసంతో దేవుని యొద్దకు రావాలి అని నమ్మలేదు. బిలాము పరిశుద్ధుడైన దేవుడు పాపాన్ని శిక్షిస్తాడని నమ్మాడుగాని పాపులు క్షమించబడతారని నమ్మలేదు. కోరహు, మానవులకివ్వబడిన దేవుని అధికారాన్ని తిరస్కరించాడు. అంత్యదినాలలో సంఘంలో ఈ విధమైన భ్రష్టత్వమే, లోపల ఉన్నవారి ద్వారానే ప్రబలుతుంది. అలాంటి వారిలో నీవు ఒకనిగా ఉండకుండా జాగ్రత్తపడాలి.

## III. భ్రష్టులను గూర్చి అలంకార రూపక వర్ణన (12,13) :

భ్రష్టులను వర్ణించడానికి యూదా స్పష్టంగా అలంకారముగా తీసికొన్నాడు.

**అ. దొంగమెట్టలు :** ఇవి కనిపించని ప్రమాణాలు. సముద్రంలో ప్రయాణిస్తున్న ఓడలు నీటి వలన బద్ధలైపోతాయి. భ్రష్టులు ప్రేమ విందులలో దొంగమెట్టలుగా ఉంటారు. వీరి వలన విశ్వాసుల, విశ్వాసం బద్ధలౌతుంది. ఆదిమ సంఘంలో ప్రభువు రాత్రి భోజనము, ఒక సహవాస భోజనంగా, ప్రేమ విందుగా ఆచరించి, అందరు కలిసి వారు తెచ్చుకొన్న భోజనాన్ని పంచుకొని తినేవారు (I కొరి 11:17-3). ఈలాంటి విందులలో భ్రష్టస్వభావం గలవారు రహస్యంగా జొరబడతారు తమ్మును తామే పోషించుకుంటారు. భౌతికంగా, ఆధ్యాత్మికంగా కూడ వీరు విశ్వాసుల ఆకలిని తీర్చరు. ఇది ప్రసంగ వేదిక నుండి కనిపించే భ్రష్టత్వం.

ఆ. **నీళ్ళులేని మేఘాలు :** ఇదే వర్ణన II పేతు 2:17లో కూడ ఉన్నది. వీరు వాక్యంతో నింపబడినట్లు కనబడతారు. కాని ఖాళీగా ఉంటారు. జీవజల నదులుగా ఉండరు (యోహా 7:38). కపట వాగ్ధానాలతో సాతాను కార్యకలాపాలను కొనసాగించే భ్రష్టులు వీరు (సామె 25:14).

ఇ. **కాయలు రాలి, ఫలములు లేక రెండు మారులు చచ్చి, వేళ్ళతో పెళ్ళగింపబడిన చెట్లు :** ఇది ఫలరహిత స్థితిని సూచిస్తుంది. ఆకురాలే కాలం చివరి దశలో కనిపించే చెట్టు స్థితి ఇది. సంఘకాలము యొక్క చివరిదశ ఇలాగే ఉంటుంది. అయితే త్వరలోనే తీర్పు అనే చిగురువేస్తుంది. రెండు మారులు చచ్చి అంటే, ఆత్మీయంగా, పాపములచేత చచ్చిన స్థితిలో ఉన్నారు (ఎఫె 2:1). జీవిత విధానంలోను చచ్చిన వారుగా ఉన్నారు (I తిమో 5:6). వీరిని దేవుడు నాటలేదు కనుక పెళ్ళగించబడతారు (మత్త 15:13). వీరికి రెండవ మరణం ఉన్నది.

ఈ. **తమ అవమానమను నురుగు వెళ్ళగ్రక్కు సముద్రము యొక్క ప్రచండమైన అలలు :** వీరికి నెమ్మది ఉండదు, కోరికలతో కొట్టు మిట్టాడుతుంటారు (యెష 57:20,21). వారి హృదయంలోని అసహ్యత వారి చర్యలలో నురుగులా వెళ్ళగ్రక్కుతారు. వారి గమ్యం ఒకటే (I పేతు 2:7; యూదా 13).

ఉ. **దారి తప్పి తిరిగే చుక్కలు :** ఇవి భ్రష్టుల గురిలేని ఉద్దేశాలకు, భయంకర లక్షణాలకు సాదృశ్యంగా ఉన్నాయి. తనలో వెలుగు ఉన్న వాడు చీకటిలో ఉన్నా ప్రకాశమైన దినములో ఉన్నట్లు ఆనందించగలడు. కాని ఆత్మలో చీకటి, అపవిత్ర తలంపులున్నవాడు వెలుగులో నడిచినా చీకటి కుహరంలో ఉన్నట్లు ఉంటాడు. విశ్వాసులైతే ఆత్మల రక్షణనే లక్ష్యముగా కలిగి ప్రకాశించే నక్షత్రాలుగా ఉంటారు. భ్రష్టులకు అట్టి లక్ష్యము లేదు గనుక దారి తప్పిన చుక్కలుగా ఉంటారు.

IV. **భ్రష్టత్వానికి రానున్న తీర్పు (14, 15) :** అంత్య దినాలలోని కపట బోధకుల తీర్పును గూర్చి పాతనిబంధన భక్తుడైన హనోకు ప్రవచించడం ఆశ్చర్యం. యేసు తన పరిశుద్ధులతో తిరిగి వస్తాడు అన్న సత్యం (కొల 3:4; I థెస్స 4:14) ఆయన ఈ లోకంలో పుట్టకముందే హనోకుకు బయలుపరచబడింది. హనోకు మరణమును చూడకుండానే తీసికొనిపోబడినట్లు, సంఘము కూడ మరణము లేకుండ ఎత్తబడుతుంది. అందులో పాల్గొనే విశ్వాసులకు, హనోకు సాదృశ్యంగా ఉన్నాడు. తరువాత యేసుక్రీస్తు రెండవసారి భూమి మీదికి వచ్చినపుడు భక్తిహీనతతో చేసిన వాటన్నిటికి తీర్పు తీరుస్తాడు (హెబ్రీ 9:27; I పేతు 3:7).

హనోకు చెప్పిన ఈ మాటలు ఆదికాండములో వ్రాయబడలేదు. హనోకు వ్రాసిన ప్రత్యక్షీకరణ గ్రంథం నుండి యూదా ఈ ప్రవచనాన్ని వ్రాసాడు.

అలాగే యూదా **"మోషే శరీరంతో కొనిపోబడుట"** అనే మరో గ్రంథం నుండి మోషే మరణాన్ని గూర్చి ఒక విశేషమైన సంగతిని వ్రాసాడు (9వ). మిఖాయేలు మోషేను పాతిపెట్టేందుకు ఆజ్ఞాపించబడినపుడు, సాతాను ఆ శరీరం తనకు చెందినదని వాదించాడు. బహుశా మోషేపై హత్యను గూర్చిన నేరారోపణ చేసి ఉండవచ్చును (జెక 3:1; ప్రక. 12:10). వాడు మరణమునకు అధిపతి గనుక చనిపోయిన వారి దేహాలపై అధికారం ఉన్నదని వాదించి ఉ ండవచ్చును. ఏది ఏమైనా, మోషే సమాధిని ఒక స్మారక చిహ్నంగా చేసి ఇశ్రాయేలీయులు ఆరాధించేలా చెయ్యాలని (I రాజు 18:4) మరియు మోషే రూపాంతరపు కొండపై కనిపించకుండ చేయాలన్నదే సాతాను ఉద్దేశం. వీడు దేవునికి విరోధి అయినప్పటికినీ, మిఖాయేలు వానిని దూషించలేదు. పైగా ప్రభువు నిన్ను గద్దించును గాక అన్నాడు.

## V. భ్రష్టత్వంలో విశ్వాసుల స్థానం మరియు వారి పాత్ర (17-23) :

భ్రష్టకాలం రాబోతుందని యేసుప్రభువు మరియు అపొస్తలులు ముందుగానే చెప్పారు (అపొ. 20:29-31; 2 తిమోతి 3:5,6). గనుక మనం కలవరపడకూడదు (17,18). దేవుడు ఒక ఉద్దేశంతో దానిని అనుమతించాడు. భ్రష్టుల ఆశలు పూర్తిగా దేవుని చిత్తానికి భిన్నమైనవి (19) వీరు సంఘంలో విబేధాలు కలుగజేస్తారు. వీరు దేవుని ఆత్మలేని, శరీరానుసారులు గనుక దేవుణ్ణి సంతోషపరచరు (రోమా 8:8,9). ఈలాంటి వారి మధ్య విశ్వాసులు ఎలా జీవించాలి?

అ. **మనల్ని మనం కట్టుకోవాలి (20వ) :** అనగా మన వ్యక్తిగత విశ్వాసంపై కాకుండ, దేవుని వాక్యం పైననే కట్టుకొవాలి. వాక్యాన్ని సంపూర్ణంగా ఎరిగి ఉండాలి. కొన్ని భాగాలు పునాదిగా, కొన్ని గోడలుగా మరికొన్ని కప్పుగా ఉంటాయి. అప్పుడే బలంగా ఉంటాయి. భ్రష్టత్వంలో పడిపోకుండ నిలుస్తాము (**II** తిమో. 2:15; **I** పేతు 1:19).

ఆ. **పరిశుద్ధాత్మలో ప్రార్థించాలి :** మనమే ప్రార్థిస్తే ప్రతి ఒక్కటి కావాలని అడుగుతాము తప్ప ఎలా ప్రార్థించాలో తెలియదు. కనుక ఆత్మ మన పక్షంగా విజ్ఞాపన చేసేందుకు అనుమతించాలి (రోమా 8:26). పరిశుద్ధాత్మలో ప్రార్థించుట అంటే, పరిశుద్ధాత్మ విశ్వాసిలో ఉండి, క్రీస్తు ద్వారా తండ్రితో మాట్లాడుట. అలా మాట్లాడడం మనం నేర్చుకోవాలి.

ఇ. **దేవుని ప్రేమలో నిలిచి ఉండునట్లు కాచుకోవాలి :** ఇది ఎలా సాధ్యం? దేవుడు విశ్వాసిని ప్రేమిస్తూనే ఉంటాడు. అయితే ఆ ప్రేమ పరిధిలో నుండి తప్పించుకోకుండ జాగ్రత్తపడాలి (కీర్త 139:7-127). అప్పుడే ఆ ప్రేమలోని సంపూర్ణ ఆశీర్వాదాలను పొందవచ్చును. ఆ ప్రేమను విశ్వాసి తనలో నుండి ప్రవహింపజేసినపుడు అదే అతన్ని కాపాడుతుంది.

ఈ. **యేసు క్రీస్తు కనికరము కొరకు కనిపెట్టాలి :** అనగా ఆయన రాకడ కొరకు ఎదురుచూడాలి (లూకా 12:37; తీతు 2:13). మనమేమైయున్నామో దానిని బట్టికాక ఆయన కనికరమును బట్టి మనం ఎత్తబడతాము. దేవుడు తన కనికరమును బట్టే మనల్ని రక్షించాడు. తన కనికరమును బట్టే మనల్ని తనతో తీసికొని వెళ్తాడు.

ఉ. **నశిస్తున్న వారిని రక్షించాలి (22, 23) :** ఈ భాగంలో మూడు రకాల ప్రజలున్నారు.

1. కనికరం అవసరమైన వారు. వీరిని సందేహాలు వేధిస్తున్నాయి.
2. తీర్పుకులోనై అగ్నిలోనికి వెళ్ళేవారు. వీరిని తక్షణమే బయటికి లాగాలి.
3. పాపంలో ఉన్నవారు. వీరిని కరుణించాలి కాని వారి అపవిత్రత ద్వారా మనము ప్రభావితం కాకుండా జాగ్రత్తపడాలి.

## VI. ముగింపు (24,25) :

ఆశీర్వాదంతో యూదా ఈ పత్రికను ముగించాడు. సమస్త మహిమ, మహాత్యము, ఆధిపత్యము అధికారము యేసు చేతిలోనే ఉన్నవి. ఆయనే మనల్ని రక్షించేవాడు, నిర్ధోషులుగా తన మహిమ యెదుట అనందంతో నిలువబెట్టగలవాడు. అంతవరకు ఈ భూమ్మీద మన విశ్వాసంలో నుండి తొట్రిల్లకుండ కాపాడగల శక్తిమంతుడు. గనుక ఆయనకే సర్వకాల మహిమ చెల్లుతుంది. ఇట్టి ప్రభువును నీవు రక్షకునిగా అంగీకరించావా? అంగీకరిస్తే, ఇతరులను రక్షణలోనికి నడిపిస్తున్నావా?

**TTB - Telugu - Study Outlines - Book of I & II Peter, I, II & III John & Jude**

Printed by : Premadhara, Trans World Radio - India, 12-1-334/17/3, Lalapet, Secunderabad - 500 017. Ph : 040-27003011

**FREE MP3 DOWN LOAD** Log on to : **www.radio882.com**